ఆంధ్రభూమి

స్వవిషయములను చర్చించు
చిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.
సంపాదకుడు :
ఆండ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౬. ఈశ్వర, శ్రావణము : ఆగష్టు, 1937. సంచిక : ౧.

సంపాదకీయసమాలోచన

౧. ఆంధ్రరాష్ట్రమునలక్షమంది కాంగ్రెస్ మెంబర్లు :—

బ్రిటీష్ ఆంధ్రమండలములలోగల ఒకకోటి ఏబదిలక్షలమంది జనులలో ఒకలక్షమంది కాంగ్రెస్సున ప్రాథమిక సభ్యులుగా చేర్చుటకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘమువారు నిశ్చయించినారు. లక్షమంది యనగా జనసంఖ్యలో నూటికి ఒకరుకంటె కూడ తక్కువయే. ఈ మాత్రము సభ్యులను చేర్చుటకు అక్టోబరు 16-వ తేదీవఱకును గడువుకలదు. కాంగ్రెస్ మంత్రిపదవులను స్వీకరించిన ఈ సమయమున ప్రజలు విరివిగ కాంగ్రెస్ సభ్యులుగ చేరుట కాంగ్రెస్ మంత్రులకు బలముకూర్చుట యగును. గ్రామ, తాలూకా, జిల్లా కాంగ్రెస్ సంఘములు శ్రద్ధవహించునుగాక !

౨. నైజాము సంస్థాన ప్రజల అస్వాతంత్ర్యము :—

ఏబదిలక్షల ఆంధ్రులకు నివాసభూమి అయిన నైజాము సంస్థాన ప్రజల అస్వాతంత్ర్యమునుగూర్చి పట్టాభి సీతారామయ్యగారిట్లు ప్రకటించుచున్నారు : 'నైజాము సంస్థాన ప్రజలు గొప్ప దురవస్థలో చిక్కువడియున్నారు. ఏదైన నొక బహిరంగసభను ప్రజలు జరుపదలంచినయెడల సంస్థానాధికారులకు ముందుగా తెలియజేసికొనవలయును. ఆసభలో నొసంగదలచిన యుపన్యాసముల సంగ్రహమునుగూడ ముందుగా అధికారులకు నివేదించవలయును. అటుపిమ్మట అధికారులు అంగీకరించిన సభ జరుపవచ్చును. ఈవిధముగా నిబంధించుట ఏ సంఘమునకైనను జన్మహక్కులను అరికట్టినట్లెంచవలెను. కాబట్టి యిటువంటి ప్రజాశయ ప్రతికూలమైన చర్యలను ఎదిరించుటకు సంస్థాన ప్రజాసంఘము ఆవశ్యకమగుచున్నది.' సంస్థానప్రజాసంఘముయొక్క పనికి తోడుపడుటకును, నైజాముప్రజలు తమ కష్టనిష్ఠురము యుగూర్చి చెప్పుకొనెడి మొరలను బహిరంగ ప్రచారముచేయుటకును మచిలీపట్టణమున నైజాముస్టేటు పీపిల్సు ఆఫీసు ఒకటి సీతారామయ్యగారి యాజమాన్యమున నెలకొల్పబడి [illegible] నైజాము ప్రజలలో అవసరమగు ప్రబోధము కలుగుటకు ఈ ఆఫీసు కార్యకారి కాగలదని నమ్ముచున్నాము.

5. ఆంధ్రదేశమున స్త్రీలకళాశాల:—

ఆంధ్రవిశ్వవిద్యాలయము ఆవరణలో పదింటికిపైగా కళాశాలలు ఉన్నవి. అందు ఒక్కటికూడ స్త్రీలకు ప్రత్యేకమైనదికాదు. తమిళదేశమున స్త్రీలకు ప్రత్యేకము కళాశాల యున్నది. మఱియు మదరాసునందలి మేరీరాణి కళాశాలాధికారులు ఆంధ్రవిద్యార్థినులను విరివిగ చేర్చుకొనకున్నారు. ఇందువలన ఆంధ్ర విద్యార్థినులు మగవారి కళాశాలలయందే విద్యాభ్యాసము గావింపవలసినవారగుచున్నారు. ఈశోచనీయస్థితి తొలగుటకుగాను ఆంధ్ర స్త్రీలకొఱకు ప్రత్యేకము కళాశాలయొకటి స్థాపింపబడుట వాంఛనీయము. కాంగ్రెస్ మంత్రులు ఆంధ్రదేశమునకు ఈ యుపకారము చేయునట్లు తగుమైన ఆందోళన దేశము సాగుగాక అనికోరెదము.

6. రాయలసీమ: మదరాసు కాంగ్రెస్ మంత్రివర్గము:—

మదరాసు కాంగ్రెస్ మంత్రివర్గమున రాయలసీమవారికి బొత్తిగా ప్రాతినిధ్యము లేకుండ చేయుట బుద్ధిపూర్వకముగ చేయబడినట్లు కనిపించుచున్నది. ఆంధ్ర విశ్వ విద్యాలయము విషయమున ఘోరమైన అన్యాయముచేసిన డా. సుబ్బరాయన్‌ను మంత్రివర్గమున చేర్చుటయు, రాయలసీమవారిని ఒక్కరినికూడ మంత్రివర్గమున చేర్చకపోవుటయు చూడ ఆంధ్రులలో విభేదము కల్పింపవలయునను ఉద్దేశము మంత్రివర్గ నిర్మాతల హృదయమున నున్నదని అనుమానించుటకు అవకాశమేర్పడుచున్నది. మంత్రివర్గపు పదస్థానములలో ఆఱ అరవలవశమైనవి. ఆంధ్రులకు మూడుమాత్రమే. మఱియొకస్థానము ఆంధ్రులకు, అది ముఖ్య ముగ రాయలసీమ ఆంధ్రులకు లభించియుండెనేని చాల తృప్తికరముగ నుండియుండును. డా. సుబ్బరాయన్ మంత్రియగుట, మంత్రివర్గమున రాయలసీమకు ప్రాతినిధ్యము లేకుండుట —ఈ రెండు విషయములును మంత్రివర్గ నిర్మాణమున ఆంధ్రనాయకుల పలుకుబడికి చెల్లు బడి లేకపోయినదనుటను విస్పష్టము చేయుచున్నవి.

7. బర్మా ఆంధ్రులకు ప్రత్యేకముగా ఒక హైస్కూలు:—

'బర్మాలో నివసించుచున్న భారతీయులందరిలోను ఆంధ్రులస్థితి మిక్కిలి శోచనీయ ముగా నున్నది. ఇండియానుండి బర్మాకు వెళ్ళిన ఇతర రాష్ట్రములవారి కందరికిని అచట ప్రత్యేకముగా హైస్కూళ్లున్నవి. ఆంధ్రులకుమాత్రమే హైస్కూలులేదు. బర్మాలో ఆంధ్రులస్థితి బాగుచేయుటకు వారికి ప్రత్యేకముగా నొక హైస్కూలును వెంటనే యేర్పరుప వలసియున్నది. ఇట్లు ఏర్పరుచుటకు ఒక లక్షరూపాయిలు కావలెను. అచటి దొరతనము వారు 50 వేల రూపాయిల నిచ్చెదరు. తక్కిన 50 వేల రూపాయిలను ప్రజలనుండి ముఖ్య ముగా ఆంధ్రులనుండి సమకూర్చవలసియున్నది. కావున ఆంధ్రదేశమువారందరును చందల నిచ్చి ఈ 50 వేల రూపాయిలను పూర్తిచేయ గోరుచున్నాము.' అని సుప్రసిద్ధ ఆంధ్రనాయ కులు విజ్ఞప్తి చేయుచున్నారు. బర్మా ఆంధ్రులు ఇచటి మన యుద్యమముల కెన్నిటికో వి విగ సాయముచేసియున్నారు. ఇపుడు వారికి మనము ఈవిషయమున తోడుపడి బర్మాం

లలో విద్యావికాసములు పెంపొందింప జేయవలసి యున్నది. ఉదారులగు ఆంధ్రులెల్లరును యథాశక్తిని విరాళములనిచ్చి ఈ యుద్యమమునకు జయము కూర్తురుగాక అనికోరెదము.

1. ఆగష్టు 1-వ తేది పరమ పవిత్ర దినము :—

ఈనాడు జరుపవలసిన ఉత్సవములను, సభలను, తీర్మానములనుగూర్చి కాంగ్రెస్ అధ్యక్షుడు పండిత జవహర్‌లాల్ నెహ్రూ గావించిన ప్రకటనమున భారత స్వాతంత్ర్య ప్రతిజ్ఞాదినమగు ఆగష్టు 1-వ తేది భారతీయులకు ఎట్లు పూజ్యమైనదో ఇట్లు నిరూపింపబడినది : "ఆగష్టు 1-వ తేది మనకు పరమ పవిత్రదినము. భారత స్వాతంత్ర్య సమరానికి అది వ్రతనము. పదిహేడు సంవత్సరాల క్రిందట ఆనాడు మహామహుడు లోకమాన్యుడు బాలగంగాధరతిలకు భౌతిక దేహాన్ని చాలించినాడు. ఆనాడే అసహాయోద్యమము ఆరంభమయింది అప్పటినుంచే మన ప్రజలకు బలాన్నీ శక్తినీ యిచ్చిన అసహాయోద్యమ సాధనము ప్రచారములోనికి వచ్చింది. ఆనాడు తగినవిధముగా ఉత్సవము జరపడము ఉచితము. గతాన్ని జ్ఞాపకము తెచ్చుకోవలెను. ధైర్యస్థైర్యాలతో మనము ముందుకు నడవవలెను.'

1. కాంగ్రెస్ వారు పదవులను స్వీకరించు టెందులకు? :—

కాంగ్రెస్ మంత్రులనుగూర్చి ఇటీవల మహాత్ముడు గావించిన ప్రకటనమున కాంగ్రెస్‌వారు పదవులను స్వీకరించుటకుగల కారణము లెస్సగ నిరూపింపబడినది. 'సంపూర్ణ స్వాతంత్ర్యముకొరకు తీవ్రముగా ప్రయత్నించుటలో రక్తపాతముతోగూడిన విప్లవముగాని, ఎవర కెన్నడును జరుగనంతటి ప్రబల తమమగు సమష్టి సత్యాగ్రహముగాని జరుగకుండ జేయుటయే కాంగ్రెస్‌వారు పదవులను స్వీకరించుటయొక్క ముఖ్యోద్దేశము. క్రొత్తచట్టమును నసాగింపవలెనను ఉద్దేశముతో కాంగ్రెస్‌వారు ఎంతమాత్రమును పదవుల స్వీకారమునకు ఆమోదించియుండలేదు.' కాంగ్రెస్‌వారి పదవుల స్వీకారమును విమర్శించువారికి నిరూపణము వాకట్టుగా నుండగలదు.

బ్రాహ్మణేతర పౌరోహిత్యము :—

ప్రతి బ్రాహ్మణేతరుడు బ్రాహ్మణేతర స్వసంఘుజులచేతనే పౌరోహిత్యము చేయించుకొనవలెనని లోగడ బ్రాహ్మణేతర మహాసభలలో తీరుమానములు సాగుచు వచ్చినవి. ఆ తీరుమానములు ఆచరణదశకు మాత్రము రాలేదు. ప్రబోధమతులగు కొందఱు బ్రాహ్మణేతరులు మాత్రము అప్పటినుండియు స్వసంఘపు పౌరోహిత్యమునే చేయించుకొనుచున్నారు. బ్రాహ్మణేతర పౌరోహిత్యమును విశేష ప్రచారమునకు తీసికొనివచ్చుటకు ఇపుడు ఆంధ్ర రాష్ట్రీయ బ్రాహ్మణేతర పురోహిత మహాసభను గుంటూరులో జరుపుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఈ ప్రయత్నములకు జయసిద్ధియగుగాక అని మనఃపూర్వకముగ కోరుచున్నాము. పౌరోహిత్యము నేడు బ్రాహ్మణుల వశమైయున్నది. ఆ బ్రాహ్మణులు పురోహితకర్మములకు మిక్కిలి దూరులై యున్నారు. అట్టివారి పౌరోహిత్యమును తలదాల్పమని ఇతర

కులములవారు అనుచో దోషమేమియును లేదు. ఉచితజ్ఞులగు బ్రాహ్మణులుకూడ ఈయుద్యమమునకు జవము, జీవము ప్రసాదింతురని నమ్ముచున్నాము.

క. నెల్లూరుజిల్లాలో జాడీ, గాజు పరిశ్రమలు:—

పారిశ్రామిక పరిశోధన సంఘమువారి యాజమాన్యమున కాశీ హిందూ విశ్వ విద్యాలయమునయున్న యం. పి. బజ్‌పాయిగారు నెల్లూరుజిల్లాలో పర్యటనముసలిపి పరిశోధనలు గావించి అచటి కొన్ని ప్రదేశములందు గాజుపరిశ్రమ, జాడీలపరిశ్రమ సాగించుటకు ముడివస్తువులు, ఇతర అనుకూలములు గలవని నిర్ధరించిరి. ముడిసామగ్రిని కొంత ఆలీపూరు ప్రభుత్వ పరిశోధనాలయమునకు పరీక్షార్థము తీసికొనివెళ్ళిరి. విదేశపు గాజుల పోటీ ఏర్పడువరకు ఆంధ్రదేశమున నెల్లూరుమండలము గాజు పరిశ్రమకు పేరు వ్రాసియున్నది. ఇపుడా పరిశ్రమ పునరుద్ధరింపబడుట కోరదగిన విషయము. పచ్చళ్లు పెట్టుకొనుట కుపయోగించు జాడీలు కూడ ఇపుడు మనము విదేశములనుండియే తెప్పించుకొనుచున్నాము. వానినికూడ మనము ఇచ్చటనే చేసికొనగలుగుటకు ముడివస్తువు లభ్యముకానుండుట ముదావహమగు సంగతి. ఈపరిశ్రమలకు ప్రభుత్వ పోషణము లభించుచో ప్రజాప్రోత్సాహము వెంటనేకలుగగలదు.

క. కీ. శే. నడకుదుటి వీరరాజు పంతులుగారు:—

ఈనాటికి సరిగా పదిదినముల క్రితము జూలై 21-వ తేదీని పిఠాపురమున శ్రీనడకుదుటి వీరరాజుపంతులుగారు పరమపదించి ఆంధ్రసారస్వత లోకమును విషాదమునముంచిరి. ఆంధ్రభాషారంగమున ప్రాతక్రొత్తల నడుమ నిలిచి రెండింటికి సమన్వయముచేయ సమకట్టిన వారిలో వీరరాజు పంతులుగారొకరు. పూర్వము పూండ్ల రామకృష్ణయ్యగారి అముద్రిత గ్రంథ చింతామణి వాదోపవాదములందు వ్యక్తమైన వీరి పాండిత్యము ఇటీవల వెంకట పార్వతీశ్వర కవుల కావ్యకుసుమావళిలోని నవ్యకవితాఫణితిని కూడ కొనియాడగల్గినది. వీరు విద్వజ్జన మనోరంజని ముద్రాశాలాధిపతులు. చేతిలో ముద్రాశాలయున్నది కావున వీరు నిరంతర సారస్వతసేవలో నుండగలిగిరి. నిరంతర సారస్వతసేవలో నుండిరి కావున వీరు ముద్రాశాలను పలువత్సరములు జయప్రదముగ నిర్వహించిరి. ముద్రాశాలవలన ఈ సారస్వతార్చకుడును, ఈసారస్వతార్చకునివలన ముద్రాశాలయు పుష్టియు, తుష్టియు పొందినవి. శ్రీవారి యాత్మకు శాంతికలుగుగాక!

క. బెజవాడ గోపాలరెడ్డిగారి ఆంధ్రాభిమానము:—

మదరాసు స్థానిక స్వపరిపాలన శాఖామాత్యులగు శ్రీయుత బెజవాడ గోపాలరెడ్డి గారికి నెల్లూరు మునిసిపలు సంఘమువారు సన్మానపత్రము ఈయ తలపెట్టగా ఆసన్మానపత్రము ఆంధ్రముననే యుండవలెనని రెడ్డిగారు నెల్లూరు మునిసిపలు కమీషనరుకు వ్రాసిరి. ఇది రెడ్డిగారి ఆంధ్రభాషాభిమానమునకు అమోఘ నిదర్శనముగానున్నది. కలకత్తా విశ్వవిద్యాలయపు స్నాతక సభోపన్యాసమునుగూడ దేశభాషలో గావించిన మహనీయుడు

మహాకవి ఠాకూరు పాదాంకములచెంత పట్టభద్రులైన రెడ్డిగారు దేశ భాషాభిమానమును వీడకుండుట గురువునకు తగిన శిష్యులగుట యే యగును.

౬. జాంజిబారు భారతీయులు : లవంగచట్టము :—

జాంజిబారున వలస నెలకొనియున్న భారతీయు లచటి లవంగముల వ్యాపారమున ప్రధానులై యున్నారు. కాని నేటినుండి అచట అమలులోనికి రానున్న లవంగ చట్టమువలన భారతీయులస్థితి శోచనీయముకానున్నది. జాంజిబారులో పదునైదువేలమంది భారతీయులు లవంగముల కృషిలో దగిలియున్నారు. ఆపంటలో పదియవభాగము హిందూదేశమున చెలామణి యగుచున్నది. పండించుటకు, పండినసరుకు విడుదలకు భారతీయుల సహకారము కావలసియుండగా నేడు పుట్టిన లవంగచట్టము భారతీయులను తృణీకరించునదిగా నున్నది. జాంజిబారు భారతీయులు హరతాళము జరిపి ఈచట్టముపట్ల తమకుగల అసమ్మతిని గాఢముగ ప్రదర్శించినారు. ఇక దేశమున భారతీయులు ఆందోళన జరిపి జాంజిబారు లవంగముల దిగుమతిని నిషేధింపవలసి యున్నది. ఇట్లు చేయుటవలన కొలోనియల్ ఆఫీసువారు లవంగ చట్టమును గావించుటలోగల తమ పొరపాటును గుర్తింపగలరు. అయితే ప్రస్తుతపరిస్థితిలో భారత శాసనసభలో ఇట్టి నిషేధము పుట్టుటకు అవకాశము గలదా?

౭. జిల్లాబోర్డు సభ్యుల కెల్లరకు ఒజ్జబంతి :—

24-7-37 తేదీని జరిగిన ఉత్తర నెల్లూరు జిల్లాబోర్డు సభలో సెకండుక్లాసు బత్తాను వదులుకొని మూడవక్లాసు రైలుచార్జి, బస్సుచార్జిలు మాత్రము తీసికొనవలసినదనియు; రోజు బత్తా వదులుకొని భోజనమునకు పూటకు 0-6-0 ను, కాఫీకి 0-2-0 మాత్రము తీసికొనవలసినదనియు ఈ జిల్లాబోర్డు సభ్యులను కోరుచున్నాము' అను తీరుమానము ఆమోదింపబడెను. తీరుమానము అంగీకరించిన పిమ్మట శ్రీయుత దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు, మరి ముగ్గురు బత్తా అసలే తీసుకొనమని బహిరంగముగా ప్రకటించిరి. ఈప్రకటన జిల్లాబోర్డుల సభ్యులకెల్లరకు ఒజ్జబంతిగా నుండదగినది. ప్రజాహిత జీవనమున తగిలియున్నవారెల్లరును శ్రీకృష్ణారెడ్డి ప్రభృతుల ఆదర్శమును గ్రహించి గౌరవార్థముగ పనిచేయుటను నేర్చుకొనుట దేశకల్యాణ కారకమగును.

౮. మద్రాసు ల్యాండు రెవిన్యూ రెమిషన్ : నడుమంత్రపు మంత్రులు :—

మదరాసు ల్యాండురెవిన్యూ రెమిషన్ విషయమున నడుమంత్రపు మంత్రులు రేగుట తంగేళ్ళుగ తొక్కుడు తొందరతో పనిచేసిరి. ఇప్పుడు అంగీకరింపబడిన రేట్లు కొత్తఫసలీలో గాని అమలుపెట్టుటకు వీలులేదు. కాంగ్రెస్ మంత్రులు ఎట్లును రానై యుండిరి. కాగా ఈ విషయమున నడుమంత్రపు మంత్రులు ఇంతటి వేగిరపాటు చూపనేల? తాము అధికారమున కొద్దిరోజులే ఉన్నను పెద్ద సౌకర్యము గావించితిమని చెప్పుకొనుచుండుటకా? లేక రాబడి తగ్గించి ప్రజాహిత కార్యములకు కాంగ్రెస్ మంత్రులకు డబ్బులేకుండ చేయుటకా?

అస్తు!

తెనుఁగుల తోఁటలో బయలు దేరిన
మొక్కలలోన నీకు చా
లిన యెఱు వీయకుండిన, తరిం
గమనించుచు కల్పుతీయకుం
డిన, వసివాడకుండ కడు నేర్పున
పెంచిన తోఁటమాలి మేల్
పనితన, మల్ల చేతి చలువన్
బలమై యలరించు నిన్నుబో!

ఆ చిననాటి నీ నడలయందము
చందము, ఆటపాటలుం
జూచిన చూపుతో నిటుల చూడఁగ
చిత్తమురాదు నేఁడు, బి
డ్డా! చిరకాలముం చెలువమారఁగ
తియ్యని పల్కు తేనెలం
బూఁచిన మల్లివై వలపు పొంగుల
తొంటి వెలుంగు నిల్పుమా!

అరుదెంచెన్ భవదీయ జన్మదిన
మమ్మా! కొమ్ము మాయీప్రియా
భరణాశీర్వచనాక్షతల్! జయము
సంపాదించి, సంపూర్ణసుం
దరమూర్తి గయి సేయుగావుత!
శతాబ్దంబుల్ జనామోద
విస్ఫురణన్, నిన్నిల గన్నవారికి
తలంపుల్ చేతి కందించుచున్!

—బొడ్డు బాపిరాజు

ఆరోగ్య విజ్ఞానము

మామిడిపళ్లు విస్తరించితినేవాళ్లు నేరేడుపళ్లు కూడా విస్తరించి తినాలి. మామిడిపళ్లు విస్తరించి తినడంవల్ల మూత్రంలో కలిగే శర్కర నేరేడుపళ్లు తినడంవల్ల తగ్గిపోతుంది.

... ...

మంచిబలమైన శరీరం కావాలంటే ఐదుఏళ్ళకి పైబడి ఇరవైఏళ్ళకులోపుగా బాగా వ్యాయామంచేయాలి.

... ...

నేత్రవ్యాధుల్లో ఆయుర్వేద వైద్యప్రకారం అంజనాలు ఉపయోగించేవారికి సంభోగము బొత్తిగాపనికిరాదు.

... ...

నేడు బజారులందు విరివిగా విక్రయింపబడే తలనూనెలలో బ్రాందివగైరాలు కలవనివి ముక్కాలి తక్కువగా ఉన్నాయి. కాబట్టి బజారుతలనూనెల వాడకం మానివేయడం మంచిది.

... ...

అకాలంలో నెరిసినజుట్టుని నల్లబఱచడంలో తాడిగింజలనూనె సాటిలేనిది.

... ...

ఎల్లొగల్జేరు ఆకుకూర రసాయనంగా పనిచేస్తుంది.

... ...

పాలకుమించిన వృష్యయోగంలేదు.

... ...

తెల్లనిరంగుగలది. తెల్లనిదూడగలది ఐన ఆవుపాలు ఆయుష్యమును వృద్ధిపొందించును.

... ...

ఆయుర్దాయంలేని బిడ్డల్నికనడం, మృత శిశువుల్నికనడం, తరుచుకూతుళ్ళనే కనడం, గర్భంనిలవకపోవడం ఇత్యాదులుకూడా స్త్రీల జబ్బుల్లోనే చేరతాయి.

... ...

ఔషధాలు చేయడానికి ఎప్పుడూ గోఘృతాన్నే వాడాలి.

... ...

శ్లీపదరోగ నిర్మూలానికి మలకోశం శుద్ధంగా ఉంచుకోవడం ప్రధానసాధనం.

విజ్ఞాన విషయములు

కొత్తగా ఒకరకంజోళ్లు కనబడ్డాయి. అవి తొడుక్కున్నవాడు నీటిమీద నేలమీదలాగే నడిచిపోవచ్చు.

... ...

నిరంతరం పరిభ్రమించే ఎలకలబోను ఒకటికనుగోబడ్డది. అందులో ఒకఎలక మరోఎలక్కి ఎరగావుంటుంది.

... ...

శబ్దాధిక్యంవల్ల ఘ్రాణశక్తి పెంపొందుతుంది.

... ...

నేటిరైల్వే ఇంజనులో సాధారణంగా 30,000 ముప్ఫయివేలభాగాలు వుంటాయి.

... ...

లండనుపోలీసు ఫోర్సులో ఒక సూపరింటెండెంటు, ముగ్గురు ఇనస్పెక్టరులు, పదకొండుగురు సార్జెంటులు, అరువదిమంది కానిస్టేబుల్సు స్త్రీలు.

... ...

అమెరికాసం యుక్తరాష్ట్రాలలో ఏడాదికి ఎలకలవల్ల కలిగేనష్టంయొక్క విలువ 3,80,00,000 మూడులక్షల యెనభైవేల పౌనులు.

... ...

కోపెన్‌హేగన్ పట్టణపుజనభా 8,50,000 ఎనిమిదిలక్షుల ఏభైవేలు. ఆ నగరంలో సైకిళ్లు నాలుగలక్షలు వున్నాయి. మోటారుబండ్లు 30,000 ముప్ఫయివేలుమాత్రమే.

... ...

యుగోస్లావియాలోని ఒపావాగ్రామంలో ఇదివరకు పశువులకు పానీయంగావుండేనీళ్లు ఇప్పుడు అక్కడ దీపాలుపెట్టుకునే చమురుగా ఉపయోగింపబడుతోంది.

... ...

సయాం అడవుల్లోని కోతులభావ గ్రామఫోనురికార్డులకు ఎత్తబడ్డవి. ఆప్లేట్లను ఆకోతులు అతిఆప్యాయంగా వింటున్నాయి.

... ...

సగటున ఒకొక్కక్క ఇల్లాలు ఇల్లుదిద్దడంలోను, పిల్లల్ని పెంచడంలోను దినానికి పండ్రెండువేల అడుగులు వేస్తుందని బోస్టన్‌లో అంచనావేయబడ్డది.

చెలికత్తెల సౌశీల్యము

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

ధనవంతుడైన యువకుడెవరైనా- జూలియాసౌశీల్యాన్ని అకారణంగా శంకించడము తప్పనుకుంది వర్జీనియా.

... ...

జూలియాసౌశీల్యము విషయమైన అనుమానాలు మళ్ళీ వర్జీనియా మనస్సులో తలనూపెను.

... ...

ఇంతసేపూ వర్జీనియామనస్సులో ఊగులాడుతూన్న అనుమానాలకూ అసలు సత్యానికీ మధ్యనవున్న తెరలన్నీ విచ్చిపోయినవి.

... ...

"జూలియా! కొన్నినిముషాలపూర్వం నీప్రవర్తన నిందించి ఉండేదాన్ని, కాని ఇప్పుడు పూర్తిగా విచారపడుతున్నాను."

ఆనాడు ఆరుగంటలకు జూలియా నివసించే గదిలోకి మనం తొంగిచూచి ఉంటే అక్కడ ఒకచక్కని 'టీ-టేబిల్' దానిమీద పరిశుభ్రంగా అమర్చబడిన ఒకటీపాత్రా, కప్పులూ, సాసర్లూ, పంచదారడబ్బా, పాలకూజా, రొట్టెలూ, వెన్నా పెట్టిఉన్న ఒకపళ్లెమూ మనకు కనుపించేవి. గదిఅంతా చాల పరిశుభ్రంగా ఉన్నది. జూలియా, వర్జీనియా ఇద్దరూ చెరియొకకుర్చీలో కూర్చొని రొట్టెలు తింటూ ఏమో మాట్లాడుకుంటున్నారు.

పాపం, వర్జీనియా తల్లిదండ్రులులేని ఒక బీదపిల్ల. కుట్టుపనివల్ల జీవిస్తూంటుంది. కాని అనేకమంది పనివాళ్లువున్న ఆలండన్ పట్నంలో ఆమెకు తగినంతపనిలేదు. ఉన్నా ఇచ్చే కూలీ చాలస్వల్పం. అందుచేత ఆ అమ్మాయి చాల విచారకరమైన పరిస్థితులలో ఉన్నదని చెప్పచ్చు. జూలియాకూడా కుట్టుపనే చేస్తుంది. కాని ఆమె ఎందుచేతనో తనజీవితమువిషయమై దిగులుపడవలసిన అవసరం లేకుండాపోయింది. ఆస్నేహితురాళ్ళిద్దరూ ఒకేయింట్లో వేరేవేరే గదుల్లో నివసిస్తున్నారు.

ఆనాడు వర్జీనియాను 'టీ'కి పిల్చింది జూలియా. విశేషం ఆర్జన లేకపోయినా ఎడతెరిపిలేకుండాఉన్న తనపనినుండి కాస్త విశ్రాంతికోసం వర్జీనియా వచ్చింది జూలియాగదికి.

ఒక్కసారి గదిఅంతా కలయజూచింది ఆబీదపిల్ల. కేవలము నిరాశా, దుఃఖమూ

మాత్రమే తాండవిస్తూండే తననివాసానికీ, జూలియాగదికీ ఎంతవ్యత్యాసం ఉంది? తనకు కూడా, ఏనాటికైనా అట్టిసౌఖ్యం లభ్యమౌతుందా? జూలియాకు ఇట్టిదశ పట్టడానికి ఏమిటికారణం? ధనవంతుడైన యువకు డెవరైనా— జూలియా సౌశీల్యాన్ని అకారణంగా శంకించడము తప్పనుకుంది వర్జీనియా. పవిత్రతా, సౌజన్యమూ ఆకారమైన వర్జీనియా ఇతరులనుగూర్చి చెడుగా తలచలేదు. జూలియాపట్ల తనకు కలిగిన అనుమానాలను తుడిచివేసికోవాలని ప్రయత్నించింది; కాని అవి ఆమెకు తెలీకుండానే ఆమెమనస్సులో సంచారంచేస్తున్నవి.

జూలియాలో పరిపూర్ణమైన ఉత్సాహం తొణుకాడుతూఉంటుంది. ఆ విభ్రమమూ, ఆ యొయ్యారమూ, ఎప్పుడూ ఆటల్లో, పాటల్లో తేలిపోదామనే ఆమె ప్రకృతిని చాటుతవి. ముఖ్యంగా ప్రాపంచికసౌఖ్యంకోసమే జన్మించాను అని అనుకుండేవాడు ఆమెను కామిస్తాడు. వర్జీనియా ముగ్ధ; సిగ్గరి. ఒక సత్పురుషుని గృహానికి గౌరవమూ, సౌఖ్యమూ తేతగిన యువతీరత్నమామె.

జూలియా బాగానే ఆదరించింది తన స్నేహితురాల్ని—ఏవిధంగానూ ఆమెను లోకువగా చూడకుండా. ఇద్దరూ రొట్టె తిని టీ త్రాగిం తర్వాత జూలియా అడిగింది: 'వర్జీనియా! ఇవ్వాళ నీపూర్వచరిత్ర అంతా నాకు చెప్పాలి. చేతనైనంతవరకు నీకు సహాయం చేయడానికి సిద్ధంగాఉన్న నీప్రియమిత్రముగా నన్ను భావించుకో. ఇంత చిన్నవయసులో తలిదండ్రులనుగోల్పోయి, నా అన్నవాళ్లు లేకుండా ఉన్నావు పాపం—''

ఆవిధంగా జూలియా తనఏకాకిత్వాన్ని జ్ఞాపకంచేసినప్పుడు వర్జీనియాకు దుఃఖమంతా పొర్లివచ్చి బుగ్గలురెండూ అశ్రుసిక్తములైనవి. అవి తుడుచుకుంటూ 'జూలియా! నా దుఃఖమంతా నీముందు వెడలగ్రక్కడము నాహృదయభారాన్ని తగ్గించుకోవడమవుతుంది; చెప్పుతా విను. కాని నీకు విసుగు పుట్టించుతానేమో'' అన్నది.

''విసుగా? పిచ్చిపిల్లా! ఈనాటికి నేను సౌఖ్యజీవితం గడుపుతున్నా కష్టాలంటే పూర్తిగా ఎరిగినదాన్నేసుమా.'' అంటూ తన కుర్చీని వర్జీనియాకు దగ్గరగా లాక్కుంది.

వర్జీనియా మొదలుపెట్టింది:

''నాతండ్రి నేను పసిపాపనైఉన్న రోజుల్లోనే మరణించాట్ట. నేను పెద్దపెరిగినతరువాత మాఅమ్మ ఎప్పుడూ ఆయన్నుగురించి చెప్పనేలేదు. ఎప్పుడైనా నేనే ఆప్రస్తావన తెస్తే ఆమె కన్నీళ్లు తుడుచుకుని విషయం మార్చి ఏవేవోసంగతులు చెప్పి నన్ను మరపిస్తూండేది. అమిత వాత్సల్యంతో నన్ను పెంచుతూన్న మాఅమ్మను ఆవిషయమై తరచితరచి అడిగి ఆమెను కష్టపెట్టడము నాకు క్రూరంగా తోచేది. నే నామెకు ఏకపుత్రిని. ఆమె నన్ను మిక్కుటమైనప్రేమతో చూచుకుంటుండేది. మూడుసంవత్సరాలైంది ఆ దేవత కూడా నావద్దనుంచి లాగికొనబడి. ఆమె మరణించునప్పటికి నాకు పదిహేనేండ్లు. జూలియా! అప్పటిపరిస్థితులన్నీ నాకు ఇప్పటికీ కన్నుల గట్టినట్లున్నవి. మూడుసంవత్సరాల క్రితం, ఆనాటిరాత్రి మా అమ్మా, నేనూ భోజనంచేసి మాయాగదుల్లోకి పోయ్యాము పడుకోటానికి. మాఅమ్మ నన్ను ప్రేమతో కౌగిలించి మరీపంపించింది. అప్పటికి రాత్రి పదిగంట లౌతుంది. మధురమైన ఆప్రశాం

తపువెన్నెలరాత్రిని దొంగవలే మృత్యుదేవత మాయింట్లో దూరబోతున్నదని ఎవ రనుకుంటారు ?

జూలియా! నా కింకా జ్ఞాపకండున్నది. పడుకునేందుకు నాగదిలోకి పోయి నేను కిటికీ వద్ద నుల్చున్నాను కొంతసేపు ఆజ్యోత్స్నా యామినీసౌందర్యాన్ని అవలోకిస్తూ. ఆకాశం—మనభూమి అనే యింటికి పైకప్పు అతి విశాలమై, నిండునీలపుచాయతో, నక్షత్ర మణులతో తాపడంచేయబడి ఉంది. చంద్రబింబము చల్లదనాన్ని చిమ్ముతూ ఉన్నది మెరుగుపెట్టబడిన వెండిపళ్లెరమువంటి ఆకారంతో. ఆద్యోవీధినుండి దేవతలు మర్త్యప్రపంచాన్ని అవలోకిస్తున్నారా అనిపించింది నాకు. నా కేదో ఉత్సాహమూ, ఆశలూ మొలకెత్తినవి హృదయంలో. ఊర్ధ్వలోకనివాసులైన దేవతలు మనలను కరుణాదృష్టులతో చూస్తున్నారనీ, సర్వశక్తిమంతుడైన భగవంతుడు తనదయాభిక్ష కోరినవాళ్ళను నిరాశలో వదలిపెట్టడనీ—ఇల్లాంటి భావాలు నాలో రేగినప్పుడు ఎట్టి ఆనందము అనుభవించానో ఎప్పటికీ మరువజాలను. అప్పుడు మోకాళ్ళమీద నిలబడి ప్రార్థించాను స్వర్గమందున్న మనతండ్రిని, భగవంతుణ్ణి— జూలియా! నాచరిత్రకు సంబంధించని ఈసంగతులన్నీ చెపుతున్నందుకు క్షమించు. అవి నీకు అనవసరమైనవిగా కనుపించుతున్నా నామేధస్సులో ఎర్రగా కాల్చిన ఇనుపకడ్డీతో వాత పెట్టినవి. మరచిపోలేకుండా ఉన్నాను.”

“జూలియా!” సన్ననిమెలుగుతో వర్జినియా తనకథ సాగించింది: “నీవు నమ్ము; నమ్మకపో; ప్రార్థనలో మన కొక ఓదార్పు ఉన్నది. మరపురాని ఆరాత్రి నామంచంమీద పడుకుని సౌఖ్యంగా నిద్రపోయ్యాను. ఆనందకరములైన చక్కనికలలు కన్నాను. నాకు అనుమానంలేశమైనా కలుగలేదు; ఏదో ఒకచెడుగు రాబోతున్నదీ అనేసందేహమే తట్టలేదు నాకు. తెల్లవారి లేచినప్పుడు సూర్యకిరణాలు కిటికీగుండా నాగదిలోకి చొచ్చుకొని వస్తున్నవి; మామూలుకన్నా కొంచెము ఆలస్యంగా లేచా నన్నమాట ఆరోజున. మొగము కడిగికొని మాఅమ్మను కలసికొనుటకు హాల్లోకి వెళ్లేను. ఆమె అంతకుముందే లేచి పనీ పాటా చేసుకుంటూ ఉంటుందని అనుకున్నాను. కాని ఆమె అక్కడలేదు. వెంటనే ఆమె నిద్రించే గదివద్దకు పోయి తలుపు తట్టేను తిన్నగా. నానెత్తిమీదికి దుర్భరములైన కష్టపరంపరలన్నీ దిగుతూన్నసంగతి నాకు తెలియనే తెలియదు. తిన్నగా తట్టేను తలుపు. మాఅమ్మ పలుకలేదు. పెద్దగా పిల్చాను. ఆమె పలుకలేదు. అప్పుడూ— అదీ మొదటిసారి— భయము అనేది, చీకటిరాత్రిలో విస్పష్టంగా కనుపించకుండా ఉండే ఒకఛాయామాత్రరూపంవలే నాహృదయంలో గోచరించడం మొదలుపెట్టింది. మాఅమ్మ నిద్రించుతూన్న ఆగదితలుపు లోపల వేసిఉన్నది. అది నేనెల్లాగు తెరువగలను? బిగ్గరగా తట్టేను తలుపు; కాని లాభం లేకపోయింది. మాఅమ్మను ప్రార్థించాను నాకు జవాబుచెప్పమని. కాని ఏమున్నది? స్మశానమునందువలె కేవలము నిశ్శబ్దము! నన్ను ఆపాదమస్తకమూ కంపింపజేస్తున్న భయంతో పిచ్చెత్తినట్లైంది నాకు. తలుపు పగులగొట్టటమేతప్ప మరి గత్యంతరం కనుపించదు. ఒకవడ్రంగివాడికోసం కబురుచేశాను. వాడు వచ్చేంతవరకూ ఆతలుపుదగ్గిరే కూర్చుని ఏడ్చేను; ఏడ్చేను. అట్టి హృదయవిదారకమైన దుః

ఖము నాజన్మలో ఎప్పుడూ అనుభవించలేదు. అంత ఉష్ణంగా నదీప్రవాహంవలే కన్నీళ్ళను నే నెప్పుడూ కార్చి యుండలేదు. ఇకముందు నాపాలబడనున్న దుస్థితి అంతా నాకన్నుల ముందు ఒకభయంకరరూపంతో బెదరించుతున్నది. వడ్రంగి వచ్చాడు—తలుపుచెక్కలు ఊడలాగేడు— నాశరీర మంతా వణకి పోతున్నది. దాటలేకపోయ్యాను ఆద్వారాన్ని— నాఆశలన్నీ పూడ్చిపెట్టబడిన ఆస్మశానభూమికి ద్వార మది. వడ్రంగివాడుకూడా భయంతో ఒకఅడుగు వెనక్కువేశాడు. భయం కాదా మరి! అక్కడి ప్రతిఅణువులోనూ మృత్యుఘోష. ధైర్యాన్నంతా చిక్కబట్టుకొని ప్రవేశించాను, చూచాను; నాభయా లన్నింటికి కారణం లేకపోలేదు. అక్కడ— ఆమంచం మీద నిన్నరాత్రివరకూ ఎంతో ఆరోగ్యంగా ఉండిన నాతల్లి శవాకారంగా పడిఉన్నది. ఒక్కకేక పెట్టేను. దుఃఖభారంతో నాశరీరం ఒరిగి ఆశవంమీద పడింది. వెక్కివెక్కి నాదుఃఖ మంతా కక్కేశాను. వడ్రంగి వైద్యుడికోసం పరువెత్తేడు. కాని ఎందుకు వైద్యుడు? అంతా ముగిసిపోయింది. నాపెన్నిధానము చాలాసేపుముందే ఈలోకాన్ని వదలి పెట్టింది. ఆమెలోని ఉష్ణమంతా ఇదివరకే లేచిపోయింది. చంద్రకాంతశిలవలె చల్లగా అయింది ఆమెశరీరం.'

వర్జీనియాధోరణి ఆగిపోయింది. అప్పటికే ఆమెధ్వనిలో ఎంత గాద్గదికము! శరీరంలోని నెత్తురంతా ఇగిరిపోయేట్లు నిట్టూరుస్తున్నది. అశ్రుప్రవాహాలు చెక్కులమీదుగా పారుతూన్నవి. జూలియా ఎన్నడూ వినలేదు అటువంటి దుఃఖగాథ తనజీవితంలో. మిక్కుటమైన జాలి వేసి ఆపిల్లను కొంచెంసేపు ఓదార్చింది. "నీ తల్లిగారి హఠాత్మరణమునకు కారణము ఎరుకపడిందా?" అని మృదువుగా అడిగింది.

గద్గదస్వరంతో వర్జీనియా మళ్ళీ చెప్పింది: "అప్పుడు వైద్యులు వచ్చారు; వచ్చి ఆమె బహుశా, గుండెజబ్బుతో మరణించిఉంటుందని నిర్ధారణచేశారు. మాఅమ్మ ఆత్మహత్య మాత్రం చేసికొనిఉండదు. అంత నీచపుపని కలలోనైనా తలపెట్టదామె. జూలియా! నా మాతృదేవత స్మశానంలో పూడ్చివేయబడ్డది. మట్టిగడ్డలు ఆమెశవంమీద పోస్తుంటే— ఆ! భగవంతుడా! నాహృదయతంత్రులన్నీ తెగిపోతున్నట్లనిపించింది. ఒకవిధమైన ఉన్మత్తదశలో ఉన్న నేను ఇంటికి మోసికొని రాబడ్డాను. కొన్ని నెలలవరకూ ఏదో మరో ప్రపంచంలో ఉన్నట్లుగా కాలంగడిచింది."

"రోజులు గడచినకొలదీ, దుఃఖభారం తగ్గుతూంటే, కొంచెంకొంచెంగా వివేకం కలిగింది నాకు. అప్పుడు నా భావిపరిస్థితులను గురించి ఆలోచించడము మొదలుపెట్టేను. అప్పుడు మాఅమ్మ పెట్టె తెరచి చూచాను, నా కుపయోగపడే డాక్యుమెంట్లూ మొదలైన వేమైనా దొరకుతవేమోనని. నేను అత్యవసరంగా తెలుసుకోవలసిన విషయాలు కల కాగిత మొక్కటీ లేదక్కడ. మాఅమ్మకు ఎక్కడెక్కడనుంచి ఏవిధమైన రాబడి వస్తుందో నా కేం తెలుసును? ఇక నేం చెయ్యాలి? నిస్సహాయను, నిస్సందేహంగా కష్టాలను ఎదుర్కోవలసిందేగా!

కొన్నాళ్ళవరకు తినుబండారాలు అప్పుగా తెచ్చుకున్నాను వర్తకులవద్ద. మాఅమ్మ పెట్టెలో ఏమైనా కాస్తడబ్బు మిగిలిఉంటే అది ఆమెఅంత్యక్రియలకే ఖర్చుఅయిపోయింది. వర్తకు లెన్నాళ్ళిస్తారు అప్పు? మరి నే నేం చేయగలను? ఇంట్లోఉన్న సామానం

తా అమ్మేసి అప్పులుతీర్చేశాను మొదట. ఒక పరుపూ, మిగిలిన నాలుగ్గుడ్డపేన్లూ, నేను మిగిలేను. ఆపెద్దయిల్లు వదిలేసి, ఇక్కడ ఈ చిన్నగది తీసికొని కుట్టుపనిమీద జీవితం గడుపుకొస్తున్నాను. కాని రోజురోజుకూ నాకు నిరాశ ఎదురౌతున్నది. సరిగ్గా కడుపు కూటికిగూడా చాలని సంపాదన. ఇట్టివి ఎన్ని కష్టాలైనా సహించగలుగుతాను మాఅమ్మే బ్రతికిఉన్నట్లయితే. ఆమె నాదుఃఖాన్ని పంచుకొని నాభారం తగ్గించేది. అభాగ్యురాలిని, ఆమె ఆశీర్వాదముకూడా కొరతపడ్డ దిప్పుడు నాకు. ఒంటరిదాన్ని—ఈవిశాలప్రపంచంలో తోడులేక, స్నేహితులులేక, భగవంతుణ్ణి ప్రార్థిస్తూండేదాన్ని, ఒక్క జాలిపలుకూ, ఒక్క దయావీక్షణమునకూ కూడా నోచుకోని ఈప్రపంచంనుండి నన్నుకూడా తీసుకపొమ్మని. మానవులందరికీ భయావహమైన మృత్యువునకు సంతోషపూర్వకముగా స్వాగత మివ్వడానికి సంసిద్ధనై ఉన్నాను. ఇంత హృదయబాధ, ఇంత దుఃఖమూ అనుభవించడానికి భగవంతునియెడ నే నేమి అపరాధం చేశానా అనుకుంటాను. పుట్టి పెరిగి ఒక్క ప్రాణినికూడా హింసించని నేను— చీమమీద అడుగువేయడానికికూడా మనసొప్పని నేను— జూలియా! ఇంత దుస్థితికి ఎరనైనానని తలచుకుంటే గుండె పగిలిపోతుంది.”

వర్జీనియా ఏడ్చింది. జూలియా ఆమెచేయిని తనచేతులలో మృదువుగా పట్టుకొని “వర్జీనియా! నీవు చాల బాధపడ్డావు. కాని నిరాశ పడవద్దు. ప్రపంచము నీ కెల్లాగు కనుపిస్తున్నదో అల్లాగే భావించి సంచరించు. ముందుముందు నీకు మంచిరోజులు వస్తవి. నీముఖంలో నీభావిభాగ్యోదయము నిద్రాణమై ఉంది. కాని ఈకుట్టుపనితో నీవు పైకి రాలేవు. నేను ఈకుట్టుపనితో కాదు.”

“చెప్పు, జూలియా ! నీహృదయ మంతా విప్పి చెప్పు.” వర్జీనియా అడిగింది కన్నీళ్లు తుడుచుకొంటూ, ఏదో క్రొత్తవిషయం వినబోతూన్న దానివలె జూలియా సౌశీల్యము విషయమైన అనుమానాలు మళ్ళీ వర్జీనియా మనస్సులో తలసూపెను.

“వర్జీనియా.” జూలియా కొంచెం తగ్గుస్థాయిలో మాట్లాడుతూంది. “వర్జీనియా!, నీతరువాతికథ ఇక చెప్పనక్కరలేదు. తల్లిదండ్రులను గోల్పోయి, నిస్సహాయవై ఈ క్రూరప్రపంచంలో ఎన్ని ఇడుములకు లోనయ్యావో ఊహించుకోగలను. కొంచెమించుమించు నీవుపడ్డకష్టాలే నేను అనుభవించాను. కాని ఇప్పటికి ఒకపై మెట్టుకు రాగలిగేను.”

“ఎట్లా వచ్చావు?” ఆదుర్దాతో అడిగింది వర్జీనియా.

“క్లుప్తముగా చెపుతా విను.” జూలియా కొంచెం వంగి కంఠస్వరం తగ్గించి అన్నది : “వర్జీనియా! ఇంతవరకూ నీవు నీసౌశీల్యాన్ని కాపాడుకొచ్చావు ; అది నేను పోగొట్టుకున్నాను.”

ఇంతసేపూ వర్జీనియామనస్సులో ఊగులాడుతూన్న అనుమానాలకూ, అసలుసత్యానికీ మధ్యనవున్న తెరలన్నీ విచ్చిపోయినవి. తనసిగ్గు తానే బయటపెట్టుకున్న జూలియా సమ్ముఖంనుంచి పారిపోదా మనిపించింది ఆమెకు. కాని కుర్చీలోనుంచి ఆమె లేవలేకపోయింది. త్రోసివేసికొనిపోవుటకు తనశక్తి చాలని కొన్నిపరిస్థితులకు పాపం జూలియా లొంగియుండవచ్చును.

“నీవు గజిబిజి పడవద్దు—నావిషయమై చెడుగా తలచవద్దు” జూలియా అన్నది వర్జీ

నియా ముఖఫలకంలో నడయాడుతూన్న భావాలను కొంతవరకు గ్రహించి: 'ఇటు చూడు; నేను చెప్పేదంతా జాగ్రత్తగా విను. సంఘం బలవంతంగా లొంగదీసుకుంది నన్ను తనక్రూరత్వానికీ, అన్యాయానికీ. శీలవతినై ఉండటము నా కిష్టంలేక కాదు; నాకు చేతగాక కాదు; ప్రపంచకం నన్నట్లా ఉండనిస్తేగా! బీదరికం— నిరాశ—ప్రేగులుకాల్చే ఆకలి— రక్తాన్ని గడ్డకట్టించే చలి—విశ్రాంతిలేని పని—ఇవన్నీ సత్స్వభావానికి శత్రువులు. మదపుటేనుగులవలె అవి కుమ్ముతూంటే నేనేకాదు, పర్వతమువలె అచలస్వభావముగల స్త్రీగూడా త్రోవ యీయవలసిందే. నేనూ ఎరుగుదును: అద్దె తక్కువని నికృష్టపుగదుల్లో ఉంటూ శీతకాలపురాత్రులందు చలిబాధ తప్పుకోడానికైనా సాధనాలులేక పడేబాధలు— నేనూ నీవలెనే విశ్రాంతిలేక పనిచేశాను; ఒడలంతా నొప్పులుపుట్టేది కర్రలతో కొట్టబడినట్లు—కన్నులదృష్టి మందగించేంతవరకూ, తలతిరిగిపోయేటంతవరకూ, నాలోనుంచి ప్రాణాలు ఎగిరిపోతున్నట్లు అనిపించేంతవరకూ పనిచేసేదాన్ని—ఆకలిబాధా పనిఅలసటా బాగా ఎరుగుదును— వర్జీనియా! ఎన్నిదినాలు నాహృదయవ్యథ అంతా కన్నీళ్ళప్రవాహాలు కట్టించాను!—ఎన్నిమార్లు భగవంతుణ్ణి ప్రార్థించాను!—మరి గత్యంతరంలేక ఆత్మహత్య చేసుకోవాలనికూడా ప్రయత్నించానంటే నీవు నమ్మవేమో.''

“అబ్బ! అబ్బ!” వర్జీనియా తనముఖాన్ని రెండుచేతుల్లో పెట్టుకుంది ఒకభయంకరదృశ్యాన్ని చూడలేనిదానివలె. “భగవంతుడా! నేనూ అట్టిగతే అనుభవింపవలసిఉన్నదా? అంతబాధా పడాలిసిందేనా?”

“తప్పదు. నీశీలమూ, నీఅమాయికత్వమూ, నీభగవద్భక్తీ అన్నీ అడుగంటజేయజాలిన కష్టపరంపర నీవూ ఎదుర్కోవలసి ఉంది. నీభావిపరిస్థితులు ఇప్పటికంటే పదివేలరెట్లు చెడుగా పరిణమిస్తవి. ఒకనాటిసాయంత్రం— అది చలికాలం— అప్పటికి మూడు రోజులనుంచీ నాకు పనిలేదు— ఆర్జనలేదు— తిండిలేదు— ఆకలి. ఒక్కసారి ఊహించుకో అప్పటి నాస్థితి ఎట్లాఉంటుందో. నిస్పృహ కలిగింది నాకు. వీధిలో చెయి చాచుకొని నిల్చున్నాను భగవంతు డెవరినైనా ఒక దయాస్వాంతుని ఇంత బిచ్చం పెట్టేవాణ్ణి పంపుతాడేమోనని. బిచ్చంకోసం చాపబడిన నాచేయి ఒకయువకుని మోహదృష్టి నాకర్షించింది. గదిఅద్దెకూడా ఇచ్చుకోలేనంత దుస్థితిలో ఉన్నాను. అటువంటిపరిస్థితులలో ఎంత స్థిరబుద్ధికలస్త్రీయైనా లొంగిపోకుండా ఉండగలదా? నేను ఉండలేకపోయ్యాను.”

“అయ్యో!— పాపం!” అంటూ వర్జీనియా తనస్నేహితురాలిచేతిని మృదువుగా పట్టుకొని అన్నది: “జూలియా! కొన్నినిముషాలపూర్వం నీప్రవర్తన నిందించి ఉండేదాన్ని కాని ఇప్పుడు పూర్తిగా విచారపడుతున్నాను.”

“ఇప్పుడు విచారించి లాభంలేదు. నా భావిదశ నిర్ణయింపబడ్డది ఈవరకే. ఆనాటినుంచీ నేను సుఖంగా ఉంటున్నాను. సౌశీల్యమనేది నాకు పరిహాసాస్పదమైనమాట అయింది. భగవంతుడిలో నాకు నమ్మకం పోయింది. సౌశీల్యంకోసమని చచ్చిపోవడానికి నామనస్సు ఒప్పుకోలేకపోయింది. అందుకనే సుఖంగా కాలక్షేపం చేయగలుగుతున్నా నిప్పుడు. ప్రజలు నన్నుకాదు నిందించవలసినది,సంఘాన్ని. దానిక్రూరత్వానికి ఎరనైనాను నేను. సోమరులూ, భోగలాలసులూ అయిన ధనవంతుల

పాదఘట్టనలకు నలిగిపోతున్నారు బీదవాళ్లు. వెస్టుఎన్డ్‌లో నివసిస్తూండే ధనవంతులయిండ్లల్లో ఒక్కసారి చూచిరా; వాళ్లుధరించే ఆడంబరపుదుస్తులమీద నీవంటి నిరుపేదరికపు కుట్టుపనివాళ్ళ నెత్తురుమరకలుఉంటవి.''

''నీవు చెప్పినదంతా సత్యము అయితే జూలియా, నావంటి అభాగ్యురాండ్రు, పవిత్రంగా, నిష్కళంకముగా జీవితము గడుపుకోవడమునకు వీలే లేదంటావా?''

''లేదు. వర్జినియా ! ముమ్మాటికీ లేదు. మనవంటి బీదవాళ్ళకుకూడా సౌశీల్యమా! నా సంగతేమైంది? ఆస్మాండ్ అనే యువకునిచేతిలో నా సిగ్గంతా భస్మీపటలమైంది. అతడు తరచు నాకోసర మిక్కడికి వస్తూంటాడు. ఇంతమాత్రం సౌఖ్యంగా జీవితం గడుపుకోటానికి నాకు ఆస్మాండ్ ముఖ్యకారణం. అతని సాంగత్యము నా కెల్లకాలమూ ఉండకపోవచ్చు. కాని నాసౌందర్యాన్ని నేనెరుగుదును మరోయువకుణ్ణి ఆకర్షించగలను. ఇదీ నా సంగతి.''

వర్జినియా జూలియాదగ్గర సెలవుతీసికొని అనేకభావాలతో బరువెక్కిన తనహృదయాన్ని తనగదికి మోసుకపోయింది. అయితే బీదవాళ్లు సౌశీల్యంగా ఉండటానికి అవకాశమే లేదా ?

—రైనాల్డ్సు అనుకరణము.

కందుక క్రీడ

రచయిత :

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

హస్తినాపురానికి వుత్తరాన పెద్ద బయలు, నడుమ అగాధమైన పెద్ద నుయ్యి.

బయటి అంచుల ఎన్నో రథాలూ, గుర్రాలూ వున్నవి. సారథులూ, పరిజనులూ గుసగుస లాడుకుంటూ నూతి కేసి చూస్తూ వున్నారు.

సుయోధనుడూ, దుశ్శాసనుడూ మొదలైన కౌరవులూ, కర్ణుడూ, పంచపాండవులూ, అందరి మిత్రులూ, అనుచరులూ, కొద్దిపాటి పరిజనులూ నూతి చుట్టూ మూగి వున్నారు. వారందరూ బంతి ఆడుకోడానికి అక్కడికి వచ్చి, సగం ఆటలో బంతి నూతిలో పడిపోగా ఆడుకోడానికి వీలు లేక, ఆబంతి వచ్చే వుపాయం తోచకా, యెలాగేనా తీసి ఆబంతితోటే ఆడుకోవాలనే పట్టుదలతోటి నూతిలోకి తొంగి చూస్తూ, వుపాయాలు వెతుక్కుంటూ, లాభం లేదని నిరుత్సాహ పడుతూ— తీవ్రంగా ఆలోచిస్తూ వున్నారు.

అర్జునుడు అందరికంటే యెక్కువ దీక్షతో ఆలోచిస్తూ వున్నాడు. "ఏమేనా తోచిందా?" అన్నట్టు ధర్మరాజు, అర్జునుడి కేసి మాటిమాటికీ చూస్తూవున్నాడు.

అది మధ్యాహ్నం, బాగా చల్లబడ్డ సమయం.

భీమసేనుడు :

బంతి మునిగిపోలేదు. ఇంకా తేలేవుంది.

ధర్మరాజు :

"అలా తెలివితక్కువగా మాట్లాడకు" అన్నట్టు భీముడికేసి రూక్షంగా చూస్తాడు.

దుశ్శాసనుడు :

ఎవరదీ ? భీమసేనుడా ? అవునోయ్! నువ్వన్నట్టది తేలే వుంది. ఎప్పుడూ తేలే వుంటుంది కూడానూ. దాని కడు పెప్పుడూ డొల్లగా వుంటుంది కనక మునిగిపోదు. అదెప్పుడూ బానలకొద్దీ పప్పు ఫప్పళాలు కొట్టదు కాదూ మరీ ?

(కౌరవులూ, వారి పక్షంవారూ చిరునవ్వు నవ్వుతారు. సుయోధనుడూ కర్ణుడూ వారిని చూపులతో వారిస్తారు)

భీమసేనుడు :

(పెంకి ంగా) ఆమాత్రం తెలుసులేవోయ్ !

అర్జునుడు :

(భీముడికేసి 'మాట్లాడకు' అన్నట్టు చూస్తాడు)

ధర్మరాజు :

చూస్తూ యిలాగ నుంచోడమేనా అది పైకివచ్చే వుపాయం యేమేనా వున్నదా ?

భీమసేనుడు :

ఒక్కటే వుపాయం. దేవతలు దిగి వచ్చినా అది యిక పైకి రాదు. మరో బంతితో సరదాగా ఆడుకుంటే వుంది; గాని, యిలాగ దిక్కులు చూస్తూ యెంతసేపు నుంచున్నా లాభం లేదు.

(దూరాన సకుటుంబపరివారంగా ద్రోణుడు.)

సుయోధనుడు :

(ఉపాయం తోచక అలాగా యిలాగా చూస్తూ, హఠాత్తుగా వుత్తరంగా చూసి చకితుడై) కర్ణా! ఎవరా వర్చస్వి ?

(అందరూ తేరిపారజూస్తారు.)

కర్ణుడు :

బ్రహ్మవర్చస్సూ, క్షత్రియతేజస్సూ మిళితం అయి రూపొందినట్టున్నది ఆమూర్తి. ఆదీర్ఘకోదండం పినాకాన్ని తోపిస్తూ వున్నది. ఉండు వుండు. మన యుయుత్సుడు వెళ్ళి, శిష్యులతో మాట్లాడి సంగతంతా తెలుసుకు వస్తున్నాడు.

సుయోధనుడు:

ఇంతటి వర్చస్వి నిదివర కెప్పుడూ చూడలేదు. వారి రాక మన నగరానికే అయితే మనం తరించిపోతాము.

కర్ణుడు :

నీకా సందేహం అక్కరలేదు. ఏమంటే ? ఇటు వచ్చిన విద్యావంతుడు హేమాహేమీల పుట్టఅయిన యీ సామ్రాజ్యపీఠం విడిచిపోయి, మారుమూల, యే పల్లెటూళ్లోనో అణగారివుంటాడా? కాక: ఇక్కడ వుండవలసిం దని మనం వారిని ప్రార్థించి కూడా నిలిపివెయ్యవచ్చు కాదూ ?

సుయోధనుడు:

నీవుద్దేశం బాగున్నది.

(అప్పుడు యుయుత్సుడు వస్తాడు.)

యుయుత్సుడు:

(దుర్యోధనుడితో మెల్లిగా) వారు ద్రోణాచార్యులవారు. ఆమె మన కృపాచార్యులవారి తోడబుట్టువు కృపీదేవమ్మవారు, ద్రోణాచార్యులవారి ధర్మపత్ని. ఆబాలుడు వారి చిరంజీవి అశ్వత్థామ. తక్కిన వారు శిష్యులు.

సుయోధనుడు:

(కర్ణుడితో) వెదకబోయిన తీగ కాళ్ళకే తగులుకున్నది. కర్ణా! ధన్యులం. ఇవాళ మంచి సుదినం. ఇలాంటి దివ్యదర్శనం మనం యిదివర కెరగం. (అందర్నీ వుద్దేశించి) ఆవచ్చేవారు ద్రోణాచార్యులగారూ, వారి కుటుంబమూ శిష్యులూనూ. పాదాభివందనం చేసి సేవించుకుందాం అందరూ రండి.

(అందరూ బయలుదేరతారు. అప్పుడు ద్రోణుడూ, కృపీ, అశ్వత్థామా, శిష్యులూ ప్రవేశిస్తారు.)

సుయోధనుడు:

(కాలిజోడు దూరంగా విడిచి, పాగా తీసి దుశ్శాసనుడి చేతి కిచ్చి, వుత్తరీయం నడుముకి చుట్టుకుని) మహానుభావా! కౌరవయువరాజు, సుయోధనుడు అభివాదం చేస్తున్నాడు. (ముందు ద్రోణుడికీ, తరవాత వరసగా కృపికీ, అశ్వత్థామకీ, శిష్యులకూ పాదాభివందనం చేస్తాడు.)

ద్రోణుడు:

స్వస్తి. నగరం బయటనే మాకు రాజదర్శనం. ఇది చాలా బాగున్నది.

సుయోధనుడు:

ఈబ్రహ్మణ్యులకు అందరూ నమస్కారాలు సమర్పించుకోండి.

(మొదట ధర్మరాజూ, తరవాత వరసగా దుశ్శాసనుడూ, భీముడూ, అర్జునుడూ, నకుల

సహదేవులూ, కర్ణుడూ—అందరూ అలా చేస్తూ వుంటారు.)

సుయోధనుడు:

(వెళ్ళి అశ్వత్థామను కౌగిలించుకుని) బాబూ! తమకు కుశలమా? కంటకమార్గంలో ప్రయాణం చెయ్యడంవల్ల తమ సుకుమారపాదాలు కందిపోతాయి నొత్తుదునా?

అశ్వత్థామ:

ఎంత మాట సెల విప్పించారూ?......కాని ధర్మంగానే వున్నది. మే మింతవరకూ అనుక్షణమూ వింటూ, వూహించుకుంటూ వున్నది యిప్పుడు ప్రత్యక్ష మైనది. మహోదార మైన భరతవంశంలో యిలాంటి ఆదరబుద్ధి వుండడం ఆశ్చర్యకరం కాదు. ప్రభూ! తమ అనుగ్రహానికి చాలా సంతోషం. తమ కటాక్షంవల్ల నాకీ ప్రయాణం చాలా వుల్లాసకరంగా వున్నది. అసాధారణ మైన తమ ఆదరణ నన్ను ఋణబద్ధుణ్ణి కూడా చేసింది.

సుయోధనుడు:

ధన్యుణ్ణి.

అశ్వత్థామ:

ఉభయత్రా అది సమానమే.

సుయోధనుడు:

తమకు ప్రత్యుత్తరం చెప్పలేను. (అశ్వత్థామను విడిచి ద్రోణుడి దగ్గిరికి వచ్చి) ఆచార్యోత్తమా! ఇతను మాతమ్ముడు దుశ్శాసనుడు. ఇతను మామిత్రుడు కర్ణుడు, తక్కిన వీ రందరూ మా తమ్ములే. వారు మా పాండురాజు దద్దయ్యగారి కుమాళ్లు. అందులోనూ వారు ధర్మనందనులు, ఆతను మారుతి భీమసేనుడు, అతను అర్జునుడు, అతను నకులుడూ, అతను సహదేవుడూనూ, తక్కినవారు మిత్రులు.

ద్రోణుడు:

చాలా సంతోషం, భరతవంశశరీరా లన్నీ యేక కాలంలో, యేకత్రా సాక్షాత్కరించడం—అందులోనూ ప్రథమదర్శనం, ఈసన్నివేశం చాలా బాగున్నది. అయితే, తమ రందరూ యిక్కడ యేమిచేస్తున్నారు ప్రభూ?

సుయోధనుడు:

మే మందరమూ బంతి ఆటకోసం యిక్కడికి వచ్చాము; కాని సగంలో అది నూతిలో పడిపోయింది. అది వచ్చే వుపాయం తోచక—(అర్థోక్తి)

ద్రోణుడు:

అందుకా నూతిలోకి చూస్తున్నారు?

సుయోధనుడు:

చిత్తం.

ద్రోణుడు:

ఉపాయం తోచే ధోరణి యెవరి కేనా కనపడుతోందా?

(ఎవరూ మాట్లాడరు)

సుయోధనుడు:

("ఏమంటా" వన్నట్టు కర్ణుడికేసి చూస్తాడు)

ధర్మరాజు:

(అర్జునుడి కేసి చూస్తాడు.)

అర్జునుడు:

(ఉపాయం తోచక చిరాకుపడుతూ మొగం వంచుకుంటాడు.)

కర్ణుడు:

నా కొకటి తోచింది; కాని—(అర్థోక్తి.)

సుయోధనుడు:

అదేదో ఆచార్యులవారికి నివేదించుకోవోయ్!

ద్రోణుడు:

అదేమిటో సెల విప్పించండి.

కర్ణుడు:

(మోడ్పుకేలితో) మహానుభావా! కులానికి నేను సూతుణ్ణి. తమకు విశదం కోసం మనవి చేసుకుంటున్నాను.

ద్రోణుడు:

నీవినయమూ, నిరాడంబరతా చాలా బాగున్నవి.

ఆ, జ్ఞాపకమున్నూ వచ్చింది. మా కృపాచార్యుడు నిన్ను గురించి చాలా దూరం చెబుతూ వచ్చాడు. అయితే, నీవచ్చున్న సూతకులప్రతీతికి అతీతంగా వున్నది. వర్ధమానులకుండవలసిన లక్షణాలు నీలో చాలా కనపడుతూవున్నవి. అంచేతనే యువరాజా వారు నిన్ను తమ ప్రాణమిత్రులుగా భావించడమూ, పెద్దలున్నూ అంగీకరించడమూ జరిగివుంటుంది. కాక: ఇక్కడ వలప్రసక్తి యేమీలేదు. అయినా నీ సత్య నిరతి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఆ వుపాయం యేమిటో చెప్పవోయ్ నాయనా !

కర్ణుడు:

ముందొక బాణంతో ఆబంతిని కొట్టడం. మరో బాణంతో ఆ మొదటి బాణం పుంఖాన్ని—[అర్ధోక్తి.)

అర్జునుడు:

నేను కొడతాను.

సుయోధనుడు:

(అర్జునుడికేసి తీవ్రంగా చూస్తాడు.)

ధర్మరాజు:

('అంత తొందరేం?' అన్నట్టు చూస్తాడు)

కర్ణుడు:

(నిరసనభావంతో) మరి చూడ్డం యెందుకూ?

అర్జునుడు:

ఇదిగో కొడుతున్నాను. (వెళ్లబోతాడు)

ధర్మరాజు:

(చెయ్యి పట్టుకుని అర్జునుణ్ణి ఆపి) ఆచార్యుల వారి సెలవు కాకుండా యేమిటా తొందర తమ్ముడూ ?

అర్జునుడు:

(ఆగిపోయి తల వంచుకు నుంచుంటాడు)

ద్రోణుడు:

(అర్జునుణ్ణి నిర్దేశిస్తూ) వీ రెవ రనీ సెల విప్పించారూ ?

ధర్మరాజు:

మహాత్మా! ఇతను మాతమ్ముడు. అర్జునుడు.

ద్రోణుడు:

తమరా? జ్ఞాపకం వచ్చింది. తమ విషయమున్నూ కృపాచార్యుడు చాలా చాలా చెబుతూ వచ్చాడు. ప్రభూ! తమ వుత్సాహం బోధపడింది. చాలా సంతోషం. సూచన వినీవినడంతోటే అర్థం చేసుకు న్నారు తమరు; కాని (కర్ణుణ్ణి చూపిస్తూ) యితని మాట పూర్తి కాలేదు. ఇతను చెయ్యవలసిన పని చెప్పాడు. సాధకబాధకాలు ఇక చెబుతాడు, తన విషయం కూడా చెప్పవలసి వుంది. ఇంతలో తమరు ఆసూచన స్వాయత్తం చేసుకోడానికి బయలుదేరడం బాగా లేదు. కనక, తమరు, యితని మాటలు విన పడ నంత దూరంగా, వెళ్ళి వుండండి, ముందు తమరే ప్రయత్నం చేద్దురు గాని.

అర్జునుడు:

(మోద్పుకేలితో) మహాప్రసాదం. (వెళ్ళి పోతాడు.)

ద్రోణుడు:

వారి కూడా యెవరూ వెళ్ళకూడదు. అక్కడ వా రొక్కరే వుండాలి. (కర్ణుడితో) మరి కానియ్యి వోయ్ !

కర్ణుడు:

ఒక దాని పుంఖానికి మరో బాణం గుచ్చుకునే టట్టు, చివరి బాణం చేతి కందేదాకా—రెప్ప వేశా టప్పటికి కొట్టాలి. ఏమాత్రం వ్యవధానం యేర్పడినా, బాణా లన్నీ వొకదాని కొకటి దండగానే గుచ్చుకున్నా, అన్నీ బంతి దగ్గిరే గొలుసు కట్టుగా పడి పోతాయి.

ద్రోణుడు:

అవును. తరవాత ?

కర్ణుడు:

చెయ్యవలసిం దిదీ. అయితే. నా కంతటి సత్తా లేదు. నేను కొట్టలేను.

ద్రోణుడు:

నీదగ్గిర పొల్లు మాటలు లేవు. స్వ పరతారతమ్యం

నీకు బాగా తెలుసు. నువ్వు తప్పకుండా ముందుకు వస్తావు. సందేహం లేదు. యువరాజావారి విశ్వాసం యెంత మాత్రమూ అపాత్రన్యస్తం కాదు. (ఇతర్ల కేసి చూస్తూ) మరెవరి కేనా మరో వుపాయం తోచిందా ?

(ఎవరూ జవాబు చెప్పరు. అందరూ వొకరి మొగం వొకరు చూసుకుంటారు.)

ద్రోణుడు:

(అశ్వత్థామతో) నువ్వే మంటావు నాయనా ?

అశ్వత్థామ:

అంతకంటే మరి నాకున్నూ తోచలేదు నాయనగారూ! నాకున్నూ సత్తా చాల దండీ.

ద్రోణుడు:

సరే. (అందరి కేసీ చూస్తూ) నాకున్నూ మరో వుపాయం కనపడ్డం లేదు. లే దనిన్నీ చెప్పవచ్చు. అయితే: కర్ణుడు చెప్పినట్టు అసాధారణశరలాఘవం వుంటే గాని అది సాధ్యపడదు; కాని అర్జునులవారు కొడతా మంటున్నారు.

అశ్వత్థామ:

అది చూడవలసిందే నండీ నాన్నగారూ !

ద్రోణుడు:

(కర్ణుడితో) ఏ మంటా వోయ్ ?

కర్ణుడు:

(మోడ్పుకేలితో) నాకున్నూ చూడా లనే వున్నది.

ద్రోణుడు:

(సుయోధనుడితో) తమ సెలవు ?

సుయోధనుడు:

తమ చిత్తం ; కాని (అందరికేసీచూసి) అందరూ చూడా లని వుబలాటపడుతున్నారు.

ద్రోణుడు:

చిత్తం. నేను వెళ్ళి దగ్గిర వుండి కొట్టించి చూస్తాను. తమ రందరూ యిక్కడే వుండండి. కనపడుతుందా యిక్కడికి ?

సుయోధనుడు:

చక్కగా కనపడుతుంది. తమరు దయచెయ్యండి.

ద్రోణుడు:

చిత్తం (వెళ్ళిపోతాడు)

అశ్వత్థామ:

(సుయోధనుడితో జనాంతికం) అర్జునులవారికిన్నీ మా కృపాచార్యులు మామయ్యగా రేనా ధనురాచార్యులు ?

సుయోధనుడు:

(అశ్వత్థామతో జనాంతికం) చిత్తం, మా కందరికిన్నీ వారే ఆచార్యులు.

అశ్వత్థామ:

(కొంచెం పెదవి విరిచి మళ్ళీ సుయోధనుడితో జనాంతికం) తమకి విలువిద్య అభిమానవిషయం కాదనుకుంటాను.

సుయోధనుడు:

(మళ్ళీ అశ్వత్థామతో జనాంతికం) తమరు సరిగా వూహించారు. గదావిద్య నాకు అభిమానం.

అశ్వత్థామ:

చిత్తం.

దుశ్శాసనుడు:

(కర్ణుడితో జనాంతికం) కొట్టగల డంటావా ?

కర్ణుడు:

(దుశ్శాసనుడితో జనాంతికం) చప్పట్లా?

దుశ్శాసనుడు:

(మళ్ళీ కర్ణుడితో జనాంతికం) అవి మాత్రం పైపైని వున్నాయా ?

కర్ణుడు:

(మళ్ళీ దుశ్శాసనుడితో జనాంతికం) ఎటయినా పైచెయ్యి మనది.

దుశ్శాసనుడు:

(మళ్ళీ కర్ణుడితో జనాంతికం) మనకి కావలసిందదీ.

ధర్మరాజు:

(భీముడితో జనాంతికం) తమ్ముడు తొందర పడ్డాడు.

భీమసేనుడు:

(ధర్మరాజుతో జనాంతికం) తమ్ముడికి పరాభవం తప్పదు; కాని ధార్తరాష్ట్రుల్లో యెవరేనా నవ్వారంటే అందర్నీ పిండిపిండి కింద కొడతాను. ఏమంటారన్నయ్యా ?

ధర్మరాజు:

(మళ్ళీ భీముడితో జనాంతికం) వద్దు వద్దు. మనకది మరీ పరాభవకారణం అవుతుంది. చల్ల-చల్లగా పూరుకో. (తర్జనితో బెదిరిస్తూ) నువ్విప్పుడు కిక్కురుమన్నావంటే బాగా జరగదు సుమా.

భీమసేనుడు:

చిత్తం.

(అందరూ నూతికేసి చూస్తారు. అందరి మొగాలమీదా ఆత్రం తొణికిసలాడుతూ వుంటుంది. కొంతసేపటికి పాండవులు తలలు వంచుకుంటారు. కౌరవులు కొంచెం వుత్సాహం కనపరుస్తారు; కాని తీవ్రంగా చూసి సుయోధనుడూ, కర్ణుడూ వారిని వారిస్తారు. తరవాత సుయోధనుడూ, కర్ణుడూ వొకరికేసి వొకరు గంభీరంగా చూసుకుంటారు. అప్పుడు ద్రోణుడు వస్తాడు, అందరూ అతనికేసి చూస్తారు.)

ద్రోణుడు:

అర్జునులవారి లక్ష్యవేధిత్వం ప్రశంసించతగ్గదే; కాని సాధన బొత్తిగా తక్కువ కావడంవల్ల సత్తా చాలింది కాదు. కొట్టలేకపోయారు. మరెవరేనా చూస్తారా ?

సుయోధనుడు:

మహాత్మా! విలువిద్య నాకు అభిమానవిషయం కాదు. (తన తమ్ములున్న వేపు కొకమాటు చూసి) మాతమ్ములునూ్న వుత్సాహపడుతూ వున్నట్టు లేదు. (ధర్మరాజు కేసి తిరిగి) తమరు—(అర్ధోక్తి.)

ధర్మరాజు:

[తల అడ్డంగా వూపుతాడు.]

సుయోధనుడు:

మరెవరూ చూసేవారు లేరు.

ద్రోణుడు:

[తల పంకిస్తూ] ఆశ్చర్యం. మరి యిక ఆబంతి ఆశ లేదన్నమాట.

సుయోధనుడు:

తమరలా సెల విప్పించవద్దు.

ద్రోణుడు:

మరేమేనా మార్గం వున్నదా ?

సుయోధనుడు:

ఉన్నది.

ద్రోణుడు:

సెల విప్పించండి.

సుయోధనుడు:

[మోదుప్పకేలితో] తమరు—[అర్ధోక్తి.]

ద్రోణుడు:

[కులాసాగా నవ్వేసి] బ్రాహ్మడు—శరలాఘవం—[సుయోధనుడి కేసి తిరిగి] ప్రభూ! పొట్టకోసం ధనుస్సు పట్టినవాణ్ణి నేను. [పెదవి విరిచి] ధైర్యం చాలదు.

సుయోధనుడు:

నా సాహసానికి మన్నించ కోరుతున్నాను.తమరు సెల విప్పించింది సత్యం—[నసుకుతాడు.]

ద్రోణుడు:

సత్యం కాదంటూరు తమరు. అంతేనా ప్రభూ ! నావిషయంలో తమ కలాంటి విశ్వాసం యేర్పడి

వుంటుంది. ఇందులో దుస్సాహసం యేమిన్నీ లేదు. మా కృపాచార్యుడు తమ కలాంటి నిశ్చయం కలిగించి వుంటాడు. అయితే, నిజానికి, నాకు, ధనుర్వేదం క్షుణ్ణంగానే తెలుసు. మెళుకువలున్నూ బాగా అవగాహన అయి వున్నవి; కాని శరవిద్య అంటే చేతికి సంబంధించినది కాని బూకరింపు విద్య కాదు.

సుయోధనుడు:

కృపాచార్యులవారు మొట్టమొదట మాకు సెలవిచ్చింది తమరు నిరాడంబరు లనీ.

ద్రోణుడు:

సరే. అతను నాకు మంచి కవచం తొడిగాడన్నమాట. అతను అసత్యవాది అని తమకి తెలవడానికెంతో సేపు పట్టదు.

సుయోధనుడు:

వద్దు వద్దు. అది అలా కానివ్వవద్దని మా సవినయ ప్రార్థన. మరిన్నీ దయవుంచి- మాకీ- వినోదం అనుగ్రహించవలసిం దనిన్నీ మాకోరిక.

ద్రోణుడు:

ప్రయత్నించడానికీ, తమ ఆజ్ఞ తిరస్కరించడానికీ కూడా నాకు సాహసం కలగడం లేదు. అయినా తమ రింత పట్టు పట్టినప్పుడు—పరశురాములవారి వుపదేశం నన్నిప్పుడు గట్టెకించకపోతుందా? కాకపోయినా, బ్రాహ్మణ్యం నాకిప్పుడు పెట్టనికోటగా వుండనే వున్నది. ఏమంటే? దూషణభూషణ తిరస్కారాలు మాకు లెక్కలోవి కావు. అందలం యెక్కడమూ, మెయ్యడమూ—యివి మాకు సమానమే. పైగా ఇంత పెద్ద ధనుస్సు భుజానికి తగిలించుకు వచ్చి కాదంటే మాత్రం యేమి చెల్లుతుంది? సరే మరీ. నేనూ ప్రయత్నం చేసి చూస్తాను. అందరూ దయచెయ్యండి.

(అందరూ నూతి దగ్గిరికి బయలుదేరతారు.)

ద్రోణుడు:

[సుయోధనుడితో] ఒక విధంగా యిది మంచికే వచ్చింది. ఏమంటారా? నేను పూనుకున్న కార్యం సిద్ధంపచెయ్యడానికేనా, భగ్నం చెయ్యడానికేనా యిది మంచి సన్నివేశం.

సుయోధనుడు:

జగదేకధానుష్కులకు భంగమా-మహాత్మా! అలాంటి సన్నివేశం కలిగించా లంటే యీశ్వరుడికేనా యెన్ని వేల గుండె లుండాలి?

ద్రోణుడు:

అఘటనఘటనాసామర్థ్యం వినా యీశ్వరత్వం యేమిటి ప్రభూ?

సుయోధనుడు:

(మోడ్పుకేలితో) నా అవినయం క్షమించకోరుతున్నాను. ఆచార్యోత్తమా! ఈశ్వరుడు వినా పరమాణువు కూడా లేదని దేశికోత్తముల వుపదేశం. తదంశ పరిపూర్ణంగా నిష్ఠితం అయితేనే మహాపురుషత్వం అనిన్నీ పెద్దల నిర్వచనం.

ద్రోణుడు:

అది సరే. అయితే, (తర్జనితో తనను నిర్దేశించుకుంటూ) ఇక్కడ వున్నది బ్రాహ్మణసామాన్యత మాత్రమే.

సుయోధనుడు:

అది అలా కాదని క్షణంలోనే వ్యక్తం కాబోతున్నది. (ఆగి)మనం నూతి దగ్గిరికి రానే వచ్చాము కూడానూ. (వెనక్కి తిరిగి "అక్కడే వుండండి అని అందరికీ సంజ్ఞచేసి ద్రోణుడితో) దయచేయ్యండి.

(ఇద్దరూ నూతి అంచుకి వెడతారు)

ద్రోణుడు:

(నూతిలోనికి చూస్తూ తర్జనితో నిర్దేశించి) బంతి అదీ అవునా ప్రభూ!

సుయోదనుడు:

చిత్తం.

ద్రోణుడు:

[ధనుస్సు చేతపుచ్చుకుని] అన్నట్టు మరిచిపోయాను. [మళ్లీ భుజానికి తగిలించుకుని గ్రీవాభంగాభిరామంగా చూస్తూ] ఎవరోయి విద్యార్థులూ?

ఒకశిష్యుడు:

(నమ్రుడై) గురుదేవా! మేము నేలంటు కూడా వదలనివాళ్లం.

ద్రోణుడు:

సరే. [ధనుస్సు చేతికి అందుకుంటూ సుయోధనుడితో] తమ ఆజ్ఞాబలం చూసుకుని సాహసిస్తున్నాను. [ధనుస్సు ఎక్కుపెట్టి టంకారం చేస్తాడు]

(అందరూ వులిక్కిపడతారు)

ద్రోణుడు:

[సుయోధనుడితో] సెలవా?

సుయోధనుడు:

[మోడ్పుకేలితో నమ్రుడవుతాడు]

ద్రోణుడు:

చిత్తగించండి. [అమ్ములపొది సరిగా సద్దుకుని, వొక బాణం చేతపుచ్చుకుని, నూతిలోనికి చూస్తూ సంధించి ఏకాగ్రతతో] శివోహం.

(నిమిషంలో బంతి పైని పడేస్తాడు. అందరూ కోలాహం చేస్తారు)

అశ్వత్థామ:

[బాణం వూడతీసి తన వుత్తరీయంతో బంతితడి తుడిచి తండ్రికేసి చూస్తాడు]

ద్రోణుడు:

యువరాజావారికి సమర్పించుకో వోయ్ నాయనా!

అశ్వత్థామ:

చిత్తం. [బంతి దోసిట వుంచుకుని సుయోధనుడి యెదట నమ్రుడై నుంచుంటాడు]

సుయోధనుడు:

[ఆదరంతో ఆబంతి పుచ్చుకుని, అశ్వత్థామను వొకమాటు పొదివి పట్టుకుని, ద్రోణుడితో] చివరికి నాఅవినయమే ఫలించింది. దోసిలి వొగ్గి నమ్రుడై మహాత్మా! ఇది మాకు అదృష్టపూర్వమే కాదు, అశ్రుతపూర్వమున్ను నన్ను పారవశ్యం చుట్టుకుంటూ వున్నది. మాట్లాడలేకుండా వున్నాను. [వంగి, బంతి కింద వుంచి, ద్రోణుడి పాదాలు అంటి, కళ్ల కద్దుకుని, మళ్లీ బంతి పుచ్చుకుని, లేచి నుంచుని] ఈబంతి మాకు తమ వరప్రసాదం. దీన్ని మేము ప్రాణపదంగా చూసుకుంటూ వుంటాము.

ద్రోణుడు:

నా వొక్కమనవి.

సుయోధనుడు:

సెల విప్పించండి.

ద్రోణుడు:

ఇందరిలోనూ యీ వుపాయం కనిపెట్టగలిగిన వాడు కుమారకర్ణుడు.

సుయోధనుడు:

మమ్మాటికీని. [కర్ణుణ్ణి దగ్గిరికి తీసుకుని కౌగిలించుకుని] ఇతను నాప్రాణమిత్రమైనందుకు పరమానందభరితుణ్ణవుతున్నాను.

ద్రోణుడు:

కనక ఆబంతి అతనికి—[అర్థోక్తి]

సుయోధనుడు:

తమరు ధర్మం సెల విప్పించారు. అభ్యుదయపరంపరాభివృద్ధిగా ఆశీర్వదిస్తూ, యిదీ, తమ దివ్యహస్తాలతో అతనికి-ప్రసాదించండి. [బంతి దోసిట వుంచుకుని అందిస్తాడు]

ద్రోణుడు:

తమ సెలవు. [బంతి పుచ్చుకుని] కర్ణా!

కర్ణుడు:

చిత్తం. [మోడ్పుకేలితో యెదటికి వెళ్లి నమ్రుడై నుంచుంటాడు]

ద్రోణుడు:

కుమారా! నీబుద్ధికి అందనిది లేదు. ధానుష్కులలో

నీపేరు మొదటి బంతిలో వుంటుంది. నీకీర్తి మధ్యందిన మార్తాండుని దివ్యప్రభాజాలంతో చుట్టరికం చేస్తుంది. త్రికరణయా నీకు నా-శుభాశీస్సులు ఇస్తున్నాను. [బంతి యిస్తాడు]

కర్ణుడు:

[బంతి పుచ్చుకుని ద్రోణుడికి పాదాభివందనం చేసి] ధన్యుణ్ణి.

ద్రోణుడు:

ఇక మేము ముందుకి సాగుతాము. తమ రందరూ వెళ్లి మళ్లీ కందుకవినోదం—[అర్థోక్తి]

సుయోధనుడు:

బంతి తీసుకోలేనివాళ్ల కింకా వినోదం అంటే యేమిటి మహాత్మా?

ద్రోణుడు:

అదేమిటి ప్రభూ! నాకు మాట తక్కేయోగం వుండడంవల్ల తమ రందరూ అశ్రద్ధ చేశారు; గాని తమ సత్తాకిది అతీశమైనదా?

(దూరాన విదురుడితో భీష్ముడు)

సుయోధనుడు:

లోకగురూ! తమ వాక్కు అమోఘం కావాలని కోరుతున్నాను. మమ్మల్నందర్నీ తమ శిష్యకోటిలో చేర్చుకుని—[అర్థోక్తి]

దుశ్శాసనుడు:

సమయానికి తాతయ్యా!

సుయోధనుడు:

[అదిరిపడి వెకక్కి తిరిగిచూసి] ఇంకేమి? మన అదృష్టం బయటపడినది. [ద్రోణుడితో] ఆచార్యోత్తమా! వారే మాతాతయ్యగారు, భీష్మాచార్యులవారిలా వేంచేస్తున్నారు. వారు తమర్ని కీర్తించని రోజు లేదు. తమరాక విన్నవించి వారి నిక్కడికి తోడుకుని వస్తాను సెల విప్పించండి.

ద్రోణుడు:

ఎంత మాట ప్రభూ! త్రిభువనవీరులూ, ఆదర్శపురుషులూ అయిన భీష్మాచార్యులవారు అయాచితంగా తటస్థపడగా వెళ్లి సేవించుకోక, నే నేమో మహామహా—అని మిటకరించుకుంటూ యిక్కడ కూచోనా? దయచెయ్యండి మేమున్నూ వస్తున్నాము. [పక్కకి తిరిగి] నాయనా! [అశ్వత్థామ చెయిపట్టుకుని, వొక్కమాటు కృపి-కేసి చూసి ముందుకి అడుగు వేస్తాడు.]

సుయోధనుడు:

దయచెయ్యండి. [వెనక్కి తిరిగి చూసి] తాతయ్యగారు విజయంచేస్తున్నారు. వారూ, ఆచార్యులవారూ సమావేశం కాబోయే యీ ముహూర్తం గొప్ప పుణ్యకాలం. అందరూ రండి. [దుశ్శాసనుడితో] తమ్ముడూ! ముందర వెళ్లి తాతయ్యగారికి సంగతి నివేదించవోయ్!

దుశ్శాసనుడు:

చిత్తం అన్నయ్యా! [ముందు వెళ్లిపోతాడు]

(ముందు కర్ణసుయోధనులూ, వారి తరవాత సకుటుంబపరివారంగా ద్రోణుడూ, వారి వెనక తక్కిన అందరూ బయలుదేరతారు)

ద్రోణుడు:

(కృపితో జనాంతికం) ఆశ్రయం దొరికిందన్న మాటే.

కృపి:

(ద్రోణుడితో జనాంతికం) బతికాము. (అశ్వత్థామతో జనాంతికం) నాయనా! ఇక నీకు లోటుండదు.

అశ్వత్థామ:

[కృపితో జనాంతికం] యువరాజావా రెంత మంచివారండీ అమ్మా!

(అందరూ వెళ్లిపోతారు)

హిమాలయ బలిపీఠము

రచయిత:

శ్రీ గిడుగు రామారావు.

మొన్న జూన్ నెల 14-వ తేదీన డాక్టరు కారల్ వీన్ గారి యాధిపత్యమున నంగా పర్వతారోహణ మొనర్చిన యాత్రీకుల దుర్మరణమునుగూర్చి పాఠకులు పత్రికలలో చదివియే యుందురు. వారిలో బ్రతికినవాడు డాక్టరు యు. లఫ్టు మాత్రమే.

హిమాలయ పర్వతారోహణమున కిదియే ప్రథమ ప్రయత్నము కాదు. ఈయజ్ఞాత ప్రదేశమునుగూర్చి తెలిసికొన పాశ్చాత్యు లెన్ని సంవత్సరములనుండియో ప్రయత్నించి యానందముతో మృత్యుదేవత నాలింగన మొనర్చినారు. ప్రకృతి శాస్త్రము లనేకము లిమిడియున్న నీప్రదేశమున కెందరు బలియైరో చూతము.

హిమాలయపర్వతములలో మిక్కిలి ఎత్తైన పర్వతశిఖరము లైదు మాత్రమే. అందు గౌరీశంకర శిఖరము 29141 అడుగులు, కించన్ గంగ 28140, నంగా శిఖరము 26620, నందాదేవి 25645, కామేట్ 25447.

గౌరీశంకర్ లేక ఎవరెస్టు శిఖరము ప్రపంచములోని అన్ని పర్వతములకంటె పెద్దది. ఇట్టి పర్వతరాజమును నెక్కుట నిజముగా గౌరవప్రదమైన పనియే. అందు కాలినడకను పోయినచో మరింత గౌరవమే కాక పర్వతము యొక్క పూర్తి వివరములు తెలిసికొన వచ్చును.

ఈయుద్దేశ్యము మొట్టమొదట ఫ్రాంసిస్ యంగ్ హస్బండు అనువానికి కలిగెను. 1893 సంవత్సరమునుండియు నాతడు ప్రయత్నించి 1903 లోను, 1908 లోను దీని నెక్కుటకు దీర్ఘమగు ప్రయత్నములు చేసెను కాని యప్పటి రాజకీయ పరిస్థితులు సరిగా లేనందుచే యప్పటికి మానుకొని మహాయుద్ధానంతరము మరల ప్రయత్నించెను. అప్పుడు బ్రిగేడియర్ జనరల్ బ్రూస్ ఇతనికి తోడయ్యెను. ఆకాశము నంటియుండు నీ శిఖరమున కాలిడుట సాధ్యము కాదని వారెరింగియు, విజయప్రాప్తికొరకు వెనుకంజ వేయలేదు.

1922 సంవత్సరము జూన్ 8-వ తారీఖునకు వీరు సుమారు 26000 అడుగులు పర్వతముపై కెగప్రాకి యచ్చటనుండి తమతో వచ్చిన కూలీలను వెనుకకు పంపివేసిరి. వారికి ముందు ప్రయాణము సౌకర్యముగనే యుండెను కాని మంచుకొండలు విరిగి యేక్షణము నెత్తినబడునోయను భయము వారికి కల్గుచునేయుండెను. నడచినకొలది బాట భయంకరమగుచుండెను. బాట సరిచేసికొనుటకు సుమారు రెండుగంటలకాలము పట్టుచుండెను. ఎట్టకేలకు ఆనాడు ప్రమాదములను తప్పించు

కొని మూడుగంటలగుసరికి యొకస్థానమునకు జేరిరి. వారితోనున్న కొందరు కూలీలు ముందునకు బోవుచునే యుండిరి. నాయకులచ్చట కొంతతడవు విశ్రమింపదలంచిరి. మలేరీ నాయకుడు కూర్చున్నచోట, పైనుండి నాలుగైదు వందలడుగులు పొడవుగల మంచుగడ్డ వ్రేలాడుచుండెను. గాలినిలిచిపోయెను. ఎండ తీవ్రముగనే యుండెను. నలుదిక్కుల గంభీరమైన శాంత మావరించెను. ఇంతలో విపరీతమగు పెద్దశబ్దము వినవచ్చెను. అయ్యది భూకంపమువలె కనుపించెను కాని యేదియో బండ విరిగి పడుచున్నదని మాత్రము నాయకులు గ్రహించిరి. ముందునడచుచున్న కూలీలు వెనుకకు తిరిగిచూచిరి. వారి కంతయు నయోమయముగా కనుపించెను. మలేరీ నడుమునకు త్రాడు కట్టియుండుటచే, మంచుబండతో నతడు కొట్టుకొనిపోక నిలచిపోయెను కాని యితని ప్రక్కనున్నవారందరును మాయమైరి. ఏమూలనుండియో సమర్ వేలు, క్రాఫోర్డుమాత్రము వీనిని కలిసికొనిరి. వీరందరును కలసి ప్రయాణముమాని చచ్చినవారికై వెదకుటకు మంచును త్రవ్వనారంభించిరి. మంచులో పాతుకొనిపోయిన యొక కూలీమాత్రము సజీవుడై యుండెను. మిగిలినవారు దొరకనేలేదు. బ్రతికియున్న యాత్రీకులందరకును ఆరోగ్యము పూర్తిగాచెడెను కావున తిరిగి వెనుకకుబోక తప్పినదికాదు. ఎవరెస్టు పర్వతమున వీరు సుమారు 26 వేల అడుగులవరకు మాత్రము పోగల్గిరి.

1924 సంవత్సరమున గౌరీశంకరు శిఖరమునెక్కుటకు పునఃప్రయిత్నములు జరిగినవి. ఈసారి దళములో 13 మంది ఆంగ్లేయులు, పర్వతారోహణమునందు నిపుణులు కలరు. వీరందరు నలుపది సంవత్సరముల లోపు వారే. వీరు మార్చి 25 తేదీని టిబెట్ ప్రాంతమునుండి దీని నెక్కుటకు ప్రారంభించిరి. జూన్ రెండవతారీఖునకు 26800 అడుగులు ఎక్కకల్గిరి. సమర్ వేలు, నార్టనుగార్లు ఎవరెస్టు శిఖరమును త్రొక్క నిశ్చయించుకొనిరి కాని సమర్ వేలు ఆరోగ్యము చెడిపోయెను. అతని గొంతుకలో కఫమడ్డుపడుచుండెను. నార్టన్ కండ్లు చెడిపోయెను. అంతఎత్తు ప్రదేశములోవారు విశ్రమించినను నిద్రపట్టుట లేదు. వీ రుభయులు అడుగుతీసి అడుగుపెట్ట లేని స్థితిలోనుండిరి కాని ధైర్యమును మాత్రము విడువలేదు. ఆమంచుకొండలలో ముందునకు పరుగిడుచునేయుండిరి. ఆక్సిజను పీల్చుటకు చాలుట లేదు అందువలన ఆలస్యముగా పీల్వసాగిరి కాని ఇదివరకుకంటె విస్తారముగా గాలి పీల్చవలసివచ్చెను. అలసటచేత వీరు క్కిరిపిక్కిరియగుచుండిరి పాపము. ఒక్కొక్కసమయములో నిద్దరును మొలలోతుమంచులో దిగబడిపోవుచుండిరి. ప్రవాహములో కొట్టుకొనిపోవుచుండిరి. ఇట్టిపరిస్థితులలో నార్టన్ వంటరిగా వదలి సమర్ వేలు అచ్చటనే యాగిపోయెను. కూలీలంతకుముందే వెనుకదారిబట్టిరి. నార్టను భగవంతునిమీద భారమువైచి ప్రకృతితో యుద్ధమొనర్చుకొనుచు తుదకు 27126 అడుగులవరకు పోగలిగెను. అచ్చటకు శిఖరము దగ్గరలోనే కనుపించుచుండెను కాని నార్టను అంతటితో ధైర్యవిహీనుడై పోయెను. ఇక తిరిగి పోవుటయే శ్రేయస్కరమని తలంచెను. ఈస్థానమును జూచి మరలిపోయిన యాత్రీకు డితడొక్కడే. అతడు తిరిగిపోయి తనమిత్రులగు అర్విన్, మలేరీలనుకలసి కొనెను. నార్టన్ విజయమును విని సంతనే వీరికిధైర్యమెక్కువై, వారిరువురును కొందరు కూలీలతో నీపర్వతారోహ

ణమునకు బయల్వెడలిరి. వారు సాయంత్రమగుసరికి అయిదవ శిఖరమును ప్రవేశించిరి. అప్పటికి వీరితో వచ్చిన కూలీలు వెనుకకు తిరిగిపోయిరి.

జూన్ 7-వ తేదీన ఓడేల్ అనువాడు మరి కొంతమందితో వీరిని కలిసికొనెను. వారివద్ద కొన్ని ప్రాణవాయుపు పీసాలను తీసికొని తాను ముందునకు 26100 అడుగుల ఎత్తునకుపోయి శిఖరమును జూచెను. అది నిర్మలముగా కనుపించుచుండెను. గాలి స్వచ్ఛముగా వీచుచుండెను. వీనికి వెనుకనే అర్విన్, మలేరీ యాత్రీకులును పోవుచుండిరి. రెండు గంటలగు సరికి సిఖరమున మబ్బులావరించెను. వారు 8-వ విశ్రాంతిస్థలమున నిలచిరి. అచ్చట కొంతసామాను విడచిపెట్టి ఆక్సిజను ఉపయోగించుకొనుచు 200 అడుగులు ముందునకుబోయిరి. అచ్చటనుండి పర్వతశిఖరము కనుపించుటలేదు. ఈప్రదేశమునకు ఒక్క ఓడేల్ మాత్రమే పోగలిగెను. మిగిలినవారు వెనుకనుండి చూచుచుండిరి. ఓడేల్ పైనుండి క్రిందివారిని బిలచెనుకాని యెవ్వరును పలుకలేదు. కనుపించుచున్న మలేరీ అర్విన్‌లు నామోనిశానములు లేకుండ పోయిరి. నిమిషమున కొకసారి అధికముగ వేడి, చల్లదనము రెండును కాలమును పంచుకొనుచుండెను. ఇట్టి స్థితిలో నతడు ముందంజవేయలేక పోయెను. సాయంత్రమగుసరికి నాల్గవమకామునకు తిరిగివచ్చెను. ఇంతసాహసముగలవాడు ఓడేల్‌నకు ముందు ఎవ్వడునులేడు. నాల్గవ మకాములోనుండి మిగిలన మిత్రులకై వెదుక నారంభించెను కాని యెవ్వరును కనుపించలేదు. ఒంటరిగా నచ్చట యుండుటతనికి కష్టముగానుండెను. అన్నియు వండుకొని తినలేక పోయెను. చలికి రక్తము సైతము గడ్డకట్టుకొని పోవుచుండెను. అచ్చట ఒక్కదినమున్న పిదప 6-వ శిబిరమున కరిగెను. మార్గమధ్యమున నేక కష్టములకు లోనయ్యెను. అచ్చట ఒక మంచురాతిపైనుండి ఎవరెస్టు శిఖరము టెలిస్కోపులో చూచెను. అచ్చట ఎవ్వరు నెక్కినట్లు కనుపించలేదు. రెండుగంటల కాలము తన మిత్రులకై వెదకి వెదకి హిమాలయాదేవి యొడిలో సుఖనిద్ర ననుభవించుచున్నారని తలంచెను. వీరుముగ్గురును ఎక్కిన చోటు 28230 అడుగులు ఎత్తుపున్నదని తరువాత తేలెను. నార్టను 27100 వరకు పోయి జీవించివచ్చెను. అచ్చటకు శిఖరము 800 అడుగులు మాత్రము కలదుకాని యచ్చటకు చేరుటకు 1600 అడుగుల ప్రయాణము చేయవలసియుండెను.

ఏప్రిల్ నెల 1933 లో నీపర్వతారోహణమునకు వాయువిమానము సహాయము కావలసివచ్చెను. హుస్టన్ సంఘము వారీప్రయత్నము చాలకాలమునుండి చేయుచుండిరి. ఈ యాత్రకు ధనసహాయము లేడీహుస్టన్ గారొసంగిరి. అంతియేగాదు ప్రయత్నమున విజయము చేకూరినచో వారికి యావజ్జీవగ్రాసము నిత్తునని వాగ్దానమొసంగెను. ఇట్టి యుదార స్వభావముగల భారతీయ కుబేరులున్నారా?

ఈ ప్రయాణమునకు వీలుగా విమానములురెండు తయారుచేయబడెను. వీనిపేరు హుస్టన్ వెస్లాండున్నూ వెస్లాండువోలస్‌న్నూ. లోపలవెచ్చగా నుండుటకు, తగినగాలి వెలుతురువచ్చుటకు, తదితరములైన సర్వసదుపాయములును దీనియందు ఏర్పాటులు గావింపవలెను. లెఫ్టినెంటుకర్నల్ బ్లోకరు పెద్ద విమానమును నడపువాడుగా నుండెను.

ప్రకృతిలో కల్గుఅటంకముల కన్నిటికిని

రక్ష యేర్పరచుకొనిరి కాని ఇంజను చెడిపోయిన నేమి చేయగలరు? కాని సృష్టియొక్క అజ్ఞాత ప్రదేశమును తెలిసికొనుటలో, ప్రపంచమున సర్వోచ్చతో పెరిగినశిఖరమును జయించుటలో, జ్ఞానపిపాసతను శాంతపరచుకొనుటలో, వారిది లెఖ్ఖ చేయ్యనే లేదు. వారికి భగవత్సహాయముకూడ కలదు. తుట్టతుదకు ఏప్రియలు 3-వ తేదీని పృద్వీస్థలమున దుర్గమస్థానమగు గౌరీశంకర్ శిఖరముపై నెగరిరి.

విమానముపై పోవుటొక వింత కాదని వారికే తెలియును కావున నిక కాలినడకను బోదలంచిరి. ఈసారి వారికి ధైర్యముకూడ అధికముయ్యెను. 1933 సంవత్సరము గ్రీష్మఋతువులో సుప్రసిద్ధ పర్వతారోహి హ్యూరటలజ్ గారి అధ్యక్షతక్రింద ఒక దళము బయలుదేరెను. మే నెల 22-వ తేదీకి 25600 అడుగులుపైకిపోయిరి. 29-వ తారీఖునకు 27400 అడుగులెక్కిరి. అచ్చట నుండి ముందునకు బోసాధ్యము కాలేదుకాని లక్ష ప్రయత్నములుచేసినను 11 జూను తేదీకి కొంచెము దూరము మాత్రమే పోగల్గిరి. జూలై రెండవ తేదీకి సగము దూరములో నుండియే వెనుకకు తిరిగి.

అటుపిమ్మట కొద్దికాలముననే డార్జిలింగునుండి మరి కొందరాంగ్లేయ యాత్రీకులు శిఖరమున కెగ ప్రాకయత్నించి తుదకేమైరో నేటికిని తెలియదు.

ఇచ్చట ముఖ్యముగా పేర్కొనదగినది హైందవ కూలీలవిషయము. యాత్రీకుల కంటె వీరికి చురుకెక్కువ. వీరు ముందంజ వేసినపిదపనే యాత్రీకులు వెంటనడచిరి. ఒక జర్మను యాత్రీకుడు వీరినిగూర్చి ఇట్లుపొగడెను "They were to us more than Porters. They were our Camrades, too brave and gallant fighters and they have gone with their friends to their last rest high above the valleys on the ridges of the Nanga Parvat."

రెండవ పర్వత శిఖరము కించనగంగ. 1899 సంవత్సరములో దీనినెక్కుటకు ప్రయత్నములు జరిగెను. ఈప్రయత్నములో ముఖ్యనాయకుడు 'పాచే'అను ప్రసిద్ధాంగ్లేయ యాత్రీకుడు ప్రాణములు కోలుపోయెను. పిదప 1920, 1925, 1926 లో ప్రయత్నములు జరిగినవి. 1929 లో ఒక అమెరికన్ యాత్రీకుడు స్వయముగా నెక్క ప్రయత్నించి పర్వతమునకు బలియైపోయెను. పిదప బవేరియన్ యాత్రీకులు 'పాల్ బాల్' అనువాని నాయకత్వమున మరియొకప్రక్కనుండి ఎక్కనారంభించిరి. 1930లో కేడరిన్ ఫర్థ అను వాడు కొంత రాష్ట్రీయదళముతో బయలుదేరెను. వీరందరకును విజయము చేకూరలేదు గాని మృత్యువాతనుండి తప్పించుకొనిరి. 1931 మరల పాల్ బాల్ గారు ప్రత్నయములు కొనసాగించిరి. ఈసారి ప్రయత్నములో హేల్ మెల్లరు అను ప్రసిద్ధయాత్రీకుడు మరణించెను. వారెట్టకేలకు 26200 అడుగులు మాత్రము ఎక్కగల్గిరి. అచ్చట భీకరజంతు భయముచే తిరిగి రావలసివచ్చెను.

నంగాపర్వతము

మొన్న జరిగిన బలిదానమీపర్వతము మీదనే. ఇట్లుమడసిన మహాయోధుల నొకసారి తలచుకొనుట కిది సమయమని యీవిషయమును గూర్చి వ్రాయదలంచితిని.

ఈ పర్వతశిఖరము హిమాలయా పర్వతశిఖరములన్నిటికంటె భయంకరమైనది. ఇది

విడిగా, దూరముగా కాశ్మీరదేశములో నున్నది. ఈపర్వతమునెక్కుట కింతవరకు మూడుసారులు మాత్రమే ప్రయత్నములు జరిగెను. మొదటిది 1895 లోను, రెండవది 1932 లోను, మూడవది 1934 లోను నాల్గవది మొన్నమొన్న.

మొదటి దళము ఆగస్టునెలలో మమరీ అనువాడు ఒక గూర్ఖావాని సహాయముతో దీనినెక్కుట ప్రారంభించెను. వారికీ పర్వతము గూర్చి వివరములేమియు తెలియవు. అచ్చట వారికి కావలసిన సామానులు వగైరాలు కూడ తీసికొనిపోలేదు. 19-వ ఆగస్టునకు 21000 అడుగులెక్కకల్గిరి. అచ్చట వారికి మంచు మైదానము తగిలెను. అందు అయిదు దినములునడచి యచ్చటినుండి ఉత్తరముగా తిరిగిరి. ఆదిక్కువారి కేదిక్కుచూపెనో నేటికిని తెలియదు వారిని వెదకుటకుకూడ ఎవ్వరును సాహసింపలేదు.

తరువాత 1932 లో హాల్‌మార్కల్ అను జర్మను యాత్రీకుడు కొందరు దేశీయ మిత్రులతో కలసి నంగా పర్వతారోహణమునకు బయలుదేరెను. వారు 15000 అడుగులు మాత్ర మెక్కకల్గిరి. వారనేక కష్టములకు లోనై 16 జూలై తారీఖునకు 26170 అడుగులెత్తునకు పోయి యచ్చటనుండి బాటలేక యగమ్యముగా నుండుటచే వెనుకకు మళ్ళిరి. తిరిగి మరియొక మకాములో విడిదిచేసి 27 ఆగస్టునకు అనుకూల వాతావరణము జూచుకొని బయలుదేరిరి కాని యిప్పుడును సాధ్యముకాలేదు.

1934 లోని దళమునకు నాయకుడు కివీమెకేల్. వీరితోవచ్చిన ఆల్‌ఫ్రెడ్ డ్రెక్సిల్ అనువాడు సగము దూరములోనే మరణించెను. ఇతని మరణానంతరము డాక్టరు బర్నాల్డు, వీలాండు, గేలే మరికొందరు కూలీలు ఈ దళములో చేరిరి.

ఆల్‌ఫ్రెడ్ డ్రెక్సిల్, అల్ప్సు, ఆల్పాయిన్ పర్వతముల నతి సులభముగానెక్కిన ధీరుడు. అతడు మరణించునప్పుడు త్రోవజూపించెను. ఆత్రోవనే వీరునడచి పర్వతముదగ్గరకు సమీపించిరికాని ఎక్కుటమాత్రము దుర్లభముగా కనుపించెను. 23 వేల అడుగులవరకు పోగల్గిరి కాని యచ్చటనుండి మంచువలన ప్రయాణము సాగలేదు. అచ్చటనుండి నంగా పర్వతమొక ద్వీపమువలెను చుట్టును మంచు మహాసముద్రమువలెను తప్ప ఏమియు కనుపించుటలేదు. ఎట్టకేలకు 8-వ నవంబరునకు కొంతవరకు పోగల్గిరి కాని వారితోనున్న కూలీలు వారిని విడచిపోయెను. అయినను వారు తమ యాశను విడువలేదు. ఆధైర్యముతో 26 వేల అడుగులవరకు పోయిరి. ఇంక 600 మాత్రమే యుండెను. మిగిలిన కూలీలు ముందునకు నడువ నిరాకరించిరి. అందువలన యాత్రీకులు తిరిగిపోక తప్పినదికాదు. ఆరాత్రి త్రోవలో నొకచోట విశ్రమించిరి. మరునాడు శీతోష్ణస్థితి సంపూర్ణముగా మారిపోయెను. దీనితో నిరాశజెందిరి. ఆహారము తినుటకు గూడ వీలులేకపోయెను. అప్పటి పరిస్థితులలో వాతావరణము సరిగానున్నను వారు నడచునట్టి స్థితిలోలేరు. అందువలన వారు తిరిగి వెనుకకుబోయిరి. వీరితోపోయిన కూలీలు కొందరీ పర్వతములలో మాయమైరి. నాలుగు దినములుగడచిన పిమ్మట నలుగురు పోర్టర్లు మాత్రము నాల్గవమకామునకు వచ్చిరి. పోర్టర్లును నాయకులును కలసి మిగిలినవారికై వెదకుచు ఏడవ మకామువరకు బోయిరి యచ్చట వారు భీషణమగు తుపానులో చిక్కువడి

నంగా మహాపర్వతమునకు ప్రాణములర్పించి కీర్తిశేషులైరి. ఇందు నలుగురు జర్మను యాత్రీకులు, 6 గురు కూలీలు మరణించిరి.

నందాదేవి పర్వత శిఖరము

హిమాలయముల కిది నిజముగా దేవీయనియే చెప్పవలెను. దీని నెక్కుటకనేకసారులు ప్రయత్నాలు జరిగెను కాని యేప్రక్కనుండి ఎక్కిన నీశిఖరమును ప్రవేశింపగలరో అదియే తెలిసికొనక పోయిరి. ఈపర్వతముచుట్టు నబేధ్యమైనట్టియు, దుర్గమపర్వతము గోడవలె నున్నది. దీని చుట్టుకొలత 80 మైళ్లు. దీని ఎత్తు 20,000 అడుగులు. ఈపర్వతము నెక్కుటకు 9 సార్లు ప్రయత్నములు జరిగెను కాని మూడుసార్లు మాత్రము వెలుపలి గోడవరకును పోగల్గిరి. ఒక్కసారిమాత్ర మీగోడ నెక్కగల్గిరి. అయినను ప్రయత్నములు పూర్తిగా వదలుకొనలేదు.

కామేటు పర్వతము

హిమాలయపర్వత రాజములలో నిదియే మిగిలినవానికంటె చిన్నది. ఈపర్వతము నెక్కుటకు 9 సార్లు ప్రయత్నించి రెండుసార్లు మాత్రమే శిఖరమున ప్రవేశింపగల్గిరి. దీనికి ప్రథమయత్నము 1847లో ఆరంభమయ్యెను.

ఇప్పటికీ హిమాలయారోహణమును గూర్చిన గాథ పూర్తిఅయినది. మొన్నజరిగిన యవాంతరమువలన గవర్నమెంటువారుకూడ భయపడుచున్నారు. కాలముగాని కాలములో యాత్రీకుల కీ పర్వతము నెక్కుట కనుమతి నీయరట!

హిమాలయ బలిపీఠమున ప్రాణములర్పించిన వీరాగ్రేసరుల యాత్మలాకైలాసమున శాంతించుగాక!

దొంగతనం

రచయిత :

ప్రయాగ కోదండరామశాస్త్రి

“నన్ను చూచి ‘దొంగ! - దొంగ?’ అనే పెద్ద మనుష్యుల్ని చూస్తే నాకు ఒక్కొక్క సారి జాలి వేస్తుంది, ఒక్కొక్క సారి కోపం వస్తుంది. వారలా అంటూవుంటే, నేను దొంగ నేనా అని అప్పుడప్పుడు ఆలోచిస్తూ వుంటాను. నేను దొంగనే అని ఒప్పుకుంటాను. అయినప్పటికీ నన్ను దొంగఅనే అధికారం వాళ్ళకు లేదనిమాత్రం వాదిస్తాను. నన్ను దొంగగా తయ్యారు చేసింది వాళ్లు; నాకు ఈ వృత్తి కన్న మరోవృత్తిఅంటే- మర్యాదగా బ్రతికే వృత్తి వుంటే ఈవృత్తికి ఎప్పుడూ పాల్పడివుండను,- ఇంతకన్నా వృత్తిలేకుండాచేసి ఇప్పుడు ‘దొంగ-దొంగ-’ అనే అధికారం వాళ్ళకు (నన్నిలాచేసిన వాళ్ళకు-) లేదు.

నిజంగా లోకం అర్థంచేసుకోగలిగితే, మహాత్ములను కొనబడేవారి చరిత్రలకన్న నాచరిత్ర లోకానికి ఎక్కువ ఉపకరిస్తుందని నా ఉద్దేశం. లోకంలో వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉద్రేకించిన ప్రతివ్యక్తీ దొంగగానో, లంజెగానో తయ్యారుకావడం సహజం అనికూడా విశ్వసిస్తాను. లోకానికి అవసరమని సేవనుకొంటున్న నాచరిత్రలోని కొన్ని అంశాలను సంగ్రహంగా తెలియజేస్తాను :

ఆనాడు ముసురుపట్టింది. విపరీతంగా జల్లు కొడుతూంది. కొల్చుకొందాంగదా అని సిగరెట్ కోసం గూళ్ళన్నీ వెదికాను. ఎక్కడా ఒక్క సెకండ్-హాండ్ పీక అయినా దొరక్కపోవడంతో మరీ గొంతు ఎండుకుపోమొదలెట్టింది. ఆముసురులోనే, ఆజల్లులోనే బజారుకు పోయాను. కొట్టువాణ్ని ఒక సిగరెట్ ఇవ్వమని కోరాను. నిరాకరించాడు. పోనీ ఈతడవ కొన్నప్పుడు చెల్లుబెట్టుకోమన్నాను. అప్పుడే యిస్తాలెమ్మన్నాడు. అక్కడే కుర్చీలపైన కూర్చొని ‘ఈ మేఘాలన్నీ మేము సృష్టించినవే’ అనేంత టీకుతో గాలిలోకి పొగవదల్తున్నవాళ్ళను చూస్తే గొంతులో తడి మరీ ఆరిపోజొచ్చింది. అభిమానం గిభిమానం నాకేమీ పట్టలేదు. ఒక బీడీ అయినా ఇమ్మని వారిని దేవిరించాను. కొందరు చప్పరించారు, కొందరు ‘లేదుబ్రదర్’ అని (జేబులో వుంచుకొనే-) సానుభూతి వెలిబుచ్చారు. చూస్తూ అక్కడే కూచున్నాను. ఒక్క గొడుగులో ఇద్దరువచ్చి ఒక సిగరెట్ పెట్టె కొనిపోబోతున్నారు. తడుస్తూ వాళ్ళ దగ్గరకుపోయి ‘ఒకసిగరెట్ ఇస్తారా’ అని వేడుకొన్నాను. ‘సాహుకారును అడుగు-’ అంటూ సాగిపోయారు వారు. సాహుకారుదగ్గరే కూర్చొని మరీ మరీ దేవిరించాను. ‘నీవు అసలు ఇక్కడనుంచి పొ’మ్మని హుకుంచేసాడు. పోకుండా కూర్చున్నట్టు కూర్చొని ఒకసిగరెట్ పెట్టె కాజేసి, బొడ్లో పెట్టుకొని ‘ఇవ్వవు కాదూ-’ అంటూ నెమ్మదిగా బయిలుదేరాను.

సాహుకారు సిగరెట్ పెట్టె పోయిందని గమనించాడు. నా వెంటబడి నన్ను పట్టుకొన్నాడు. నాదగ్గర వున్న సిగరెట్ పెట్టె దూరంగా విసిరేసి, ‘నాకేమీ తెలే’దన్నాను. తలొకదెబ్బ కొట్టారు. కావలెనంటే కొనుక్కోరాదా? అన్నారు. డబ్బులేదన్నా. అంతడబ్బులేనివాడివి ఎందుకు త్రాగాలి? అన్నారు. మున్సిఫ్ దగ్గరకు పట్టుకెళ్లారు. మున్సిఫ్ నాలుగుతన్ని

పోలీస్ స్టేషనుకు పంపాడు. వాళ్ళూ ఓపిక ఉన్నంతవరకు కొట్టి కోర్టుకు పట్టుకెళ్లారు. కోర్టువారు ఆరువారాలు కఠినశిక్ష వేసారు.

జైలు అయిపోయింది. ఇంటికి వచ్చాను. ప్రతివాడూ నన్నో వింతజంతువునుగా జూడ మొదలెట్టారు. నాకు మహా అసహ్యంగావుంది. ఎవడివద్దనైనా పనిచేస్తానంటే,—'ఏందొబ్బుకుపోతావో - వద్దులే-' అంటున్నారు.

కొన్నాళ్లు గడచినవి.

నాజీవితం నాకే దుర్భరంగా తోచింది. ఆత్మహత్య చేసుకోందామని చాలసార్లు తీవ్రంగా ఆలోచించాను. మావూళ్ళోవున్న డాక్టర్నికూడా అనేక పర్యాయములు ఏదో ప్రస్తావవశంగా 'ఏంతింటే చస్తారు?- ఏమిటి?' అంటూ అడుగుతూవుండేవాణ్ణి. గచ్చకాయ, నల్లమందూ ఇలాంటివంటే నాకు ఏమిటో వెగటు. ఏదన్నా తియ్యని ఇంగ్లీష్ విషంత్రాగి చనిపోవాలని వుండేది. ఎందువల్లనో, కారణం యిప్పుడు చెప్పలేను- నాలోనుండి ఆప్రయత్నం తొలగిపోయింది. నాలోనున్న వ్యక్తిత్వం ముందుకొచ్చింది.

నేనూ, ఒక స్నేహితుడూ కలిసి ఊరిబయటికి షికారువెళ్లాము ఒకనాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ వుండగానే ప్రొద్దుపోయింది. వద్దామని యింటికి వస్తూవుండగా ప్రక్కవూరి సావుకారు ఒంటరిగా పోతూవున్నాడు. ఇద్దరమూ కలిసి వాణ్ణి కొట్టాము. వాడివద్ద పాతికరూపాయలు దొరకినవి.

ఊళ్ళోవుండకుండా 'బెజవాడ'కు రైలెక్కాము. సిజర్ సిగరెట్లూ, కాఫీహోటలూ ఆరాత్రి- ఒక్కయువతి తక్కువగా- దేవేంద్రభోగం అనుభవించాము. ప్రొద్దున కాఫీత్రాగి జేబు చూచుకొనేప్పటికి పదిరూపాయలుమాత్రం వున్నవి. రెండు దోవతులూ రెండు తుండుగుడ్డలూ కొని, హోటల్లో భోజనంచేసి, సాయంత్రందాకా బజారువెంటతిరిగాము.

సాయంత్రం 5 గంటలకు ఒకకారు బొమ్మలకాగితాలను వెదజల్లుతూపోయింది. చూస్తే ఇంగ్లీష్‌ఫిలిం అని తేలింది. చూదామనిపించింది.

సినిమాచూచి బయటికి వచ్చేప్పటికి జేబులోవున్న పైకం మూడణాల మూడుకానులు. వున్నసరుకు నాలుగు సిజర్ సిగరెట్లుగల ఒకప్యాకెట్టూ, సగంకాళీ అయిన ఓ అగ్గిపెట్టే, మడిచిపెట్టుకొన్న సినిమా నోటీస్ కాగితమూ, సగంచింపిన టిక్కెట్టుముక్కా గాజుపాళీ వాటర్‌మన్ పెన్నూ.

తిండి ఎలాఅనే చర్చ జరిగింది. హోటల్లో భోంచేసి ముందరి కిల్లీకొట్టుదగ్గర కిల్లీనములుతూవున్నట్టువుండి సాగిపోదామని తేల్చుకొన్నాము.

అనుకొన్నంతా చేసాము. స్టేషనుకువచ్చి రెండు ప్లాట్-ఫారంటిక్కెట్లుకొని, రైలు సాగేవేళకు బండి ఎక్కాము. గుడ్స్‌షెడ్ ప్రక్కనదిగి, గేటు తిరిగి కొంపలను చేరాం. ఒక్క అరగంటకే పోలీసులు ఇద్దర్నీ కచేరీకి చేర్చారు. తర్వాతిపని యధాప్రకారంగానే జరిగింది. మాఇద్దరికీ చెరి ఆరునెలలూ భోజనం గ్రాంటుచేసింది ప్రభుత్వం.

జైలులోని నా అనుభవాలను మరోసారి విన్నవించుకొంటాను. ఆసారితో నాకు జైలన్నా, ప్రభుత్వం అన్నా వున్నభయం పటాపంచలైపోయింది. ఇంతకన్నా ఏంచేస్తుంది ప్రభుత్వం? అనే ధీమా ఏర్పడింది. క్రమంగా దొంగతనమే నావృత్తి అయిపోయింది.

దొంగతనాన్ని నావృత్తిగా చేసుకొనేందుకు నేనేమీ ప్రయత్నించలేదు. అణచబడిన నా అవసరాలు అప్పుడప్పుడు నన్నుద్రేకపరుస్తుండేవి. ఎప్పుడో వీలైనప్పుడు వీలయినట్లు ప్రవర్తించవలసివచ్చేది.

ఇప్పటికి- ఈ దొంగతనం వృత్తికావడంవల్లా, ఏడాదికి తొమ్మిదినెలలు ధర్మసత్రం కనుకా సోమరిగా తయ్యారయినాను. నేను నావంటి ఎవ్వరికీ దొంగతనం చేయవలసిందని సలహా యివ్వనుగాని, చేసే నావంటివాణ్ని- అంటే లేనివాణ్ని అభినం

దిస్తాను. వాడిలోవున్న అభిమానం వ్యక్తిత్వం వాణ్ణిలా పురికొల్పినవని నమ్ముతాను. నావృత్తిని మీరు గౌరవించరని నాకు తెలుసు. మీరేకాదు, నేనుకూడా గౌరవించను. మనంగౌరవించని ఈవృత్తి లేకుండా చేయడానికి మనం యత్నించాలి. అది ఎలా నిర్మూలింపబడుతుందో నాకు తెలుసు:

దౌర్జన్యంతో సాధ్యంకాదు. అది ఏకారణంవల్ల జరుగుతున్నదో అర్థంచేసుకొని ఆకారణంలేకుండా చేస్తే పోతుంది. ఆకారణం ఏమిటి? దరిద్రం.

దరిద్రంలేకుండాపోతే దొంగతనం వుండదని నేను గట్టిగా చెప్పగలను. లేకుండా చేయగలను కూడా.


ఈదరిద్రం అనే మహాసమస్యను అనేక తత్వాలు ఎదుర్కొంటున్నవి. కాని, ఒక్క సామ్యవాదం తక్క ప్రతిదీ ఫెయిల్ అవుతున్నది. ఆసామ్యవాదం అనే పేరు వింటేనే ధనికసంఘం (ప్రభుత్వంలో వున్న సంఘం-) తన ప్రత్యేకత పోతుందని అణచి వేస్తున్నది.

ఇలాంటప్పుడు దరిద్రమూపోదు, దొంగతనమూ పోదు. ఒక పోలీస్‌స్టేషన్‌కు పది స్టేషన్‌లు కట్టించినా ఈ దొంగతనంపోదు. పోదుగదా, విపరీతంగా పెరిగిపోతుంది.

... ...

నాకుతోచిన అంశాలను మీముందు పెట్టడమే నావిధి. మీరు ఎలా అనుకొన్నా ఇందులోని ప్రతి అంశమూ యథార్థమని ప్రత్యక్షంగా అనుభవంగల నేను ధ్రువపరుస్తున్నాను.

ముందు ముందు మీదయవుంటే నాజైలు అనుభవాలనుకూడా అందజేస్తాను.''



చెప్పుల వ్యాపారంలో చెప్పరాని ధనం

ఆర్జించినవాడు ఫ్రాంక్ మెక్ విల్లి.
ఆర్జించుపాపులు రెండువందలయేబది.
ఆర్జన 1928లో నలుబదిలక్షలపౌనులు.

చిల్లరగా చెప్పులు అమ్ము వ్యాపారములో లాభములు మిక్కిలితక్కువగా ఉండును. కాని చిల్లరగా చెప్పులు అమ్మి లక్షలకొలది ధనమార్జించిన వ్యక్తి యొకడు కలడు. అతనిపేరు ఫ్రాంక్ మెక్ విల్లి. అతనికి అమెరికా సంయుక్త రాష్ట్రములందు రెండు వందల జోళ్ళ దుకాణములున్నవి.

ఫ్రాంకు మెక్ విల్లి అసామాన్య వ్యక్తి. అతడు స్కాట్ జాతీయుడు. అతనిది గట్టి శరీరము. పొడుగైనవాడు. 1930-వ సంవత్సరము నాటికి అతనికి డెబ్బదియొక్క సంవత్సరములు నిండినను ఆరోగ్యవర్ధేహుడై యుండెను.

అతడు పుట్టినది దరిద్రకుటుంబమున. ఎవరుకాని అతనికి ఎట్టి ధనమునుకాని ఈయలేదు. జీవితములోని మూడుభాగములలో మొదటి భాగమున అతడు మిక్కిలి దురదృష్టవంతుడై యుండెను.

పదునైదేండ్ల బాలప్రాయమున అతడు ఒకానొక లాయరు ఆఫీసులో వారమునకు పంద్రెండు షిల్లింగుల జీతమునకు గుమాస్తాగా కుదిరెను. ఆజీతము అతనికి చాలలేదు. అతనికి ఇంకను ఎక్కువ డబ్బు కావలసియుండెను. కావున టోపీలుచేయు నొక దుకాణములో అతడు పనికి కుదిరెను. వారమునకు ఇంతజీతము అనుపద్ధతికి అతడు అంగీకరింపలేదు. ఇంతపనికి ఇంతడబ్బు అను పద్ధతికి ఒప్పుందము. మిక్కిలి కష్టపడి పనిచేసెను. విశ్రాంతి యెఱుగని పరిశ్రమ. వారమునకు ఎనిమిది పౌనులను సంపాదింపగలిగెను.

కొంత ధనమును కూడబెట్టిన తోడనే స్వతంత్ర వ్యాపారమునకు ప్రారంభము చేసెను. మొదట గ్రుడ్ల వ్యాపారము. పిమ్మట పడమటి దేశమునకుపోయి పశుల కాపరి అయ్యెను.

పశువులు చర్మమును, చర్మము జోళ్ళను అతని ఆలోచనకు తెచ్చిన విశాబోలును! అప్పటి అతని ఆలోచన ఎల్ల వేళలయందును జోళ్లే.

ఒకానొక జోళ్ళకంపెనీలో ఎక్కవుంటు గుమాస్తాపని అతనికి లభ్యమాయెను. ఆ సందర్భమున మెక్ విల్లి జోళ్లుచేయుట కగు ఖర్చు వాని అమ్మకమువలన వచ్చులాభము బాగుగ ఆకళించెను. అటుపిమ్మట అతడు జోళ్ళకంపెనీకి ఏజెంటై ఊరూరతిరిగి చిల్లరవర్తకులకు జోళ్ళను విక్రయించువాడు. పనిచేయుచు అతడు జోళ్ళవ్యాపారమునగల సులువు, బరువుల నన్నిటిని నేర్చుకొనువాడు. నిచ్చెన మెట్లను ఒక్కొక్కదానిని ఎకునట్లు అతడు జోళ్ళవ్యాపారమున ఒక్కొక్క మెట్టును ఎక్కుచు ఆవ్యాపారవిషయమై సమస్తమును నేర్చుకొనెను.

ఇక ఇప్పుడు అతనికి కావలసినది ఏమి? తనదైన ఒక జోళ్ళషాపు. అతనికి అప్పటికి ముప్పదినాలుగేండ్లు. తనయజమానివద్ద రెండు వేలపౌనులను అప్పుచేసెను. చెప్పుల దుకాణమును స్థాపించెను. అనంతరకాలమున అతని యాజమాన్యక్రి[illegible] బయలుదేరిన రెండువందల నలుబదితొమ్మిది చెప్పుల దుకాణములకిది మాతృక.

మొదటి దుకాణమును స్థాపించునప్పటి అతని ముఖ్యాభిప్రాయమేమి? అందముగా, అమరికగా, డాబుగా దుకాణమును ఏర్పాటు చేయుట. దుకాణమునకు ముందరిభాగమున పెద్దపెద్ద అద్దములతో దర్వాజాలుపెట్టెను. ఈ దర్వాజాలు ఐమూలగా ఏర్పాటుచేయబడుటచే దుకాణములోనికి ఏ దిక్కునుండి వచ్చినను వచ్చినవారికి జోళ్లుస్పష్టముగా కనిపించుటకు అవకాశమేర్పడెను.

ఈ దుకాణము జయపథమును ప[illegible]ను. అచిరకాలముననే మఱి నాలుగు కొత్తషాపులను స్థాంచెను, ఇప్పుడు అతనివి రెండువందల ఏబది జోళ్ళషాపులు. అన్నిటియందును మగవాళ్ల జోళ్లు విక్రయముచేయబడుచుండెను.

అతనిషాపులు మూడురకములవి. మొదటి రకము షాపులలో మిక్కిలి విలువగలజోళ్లు అమ్మబడును. రెండవ రకము షాపులలో మధ్యరకపుజోళ్లు అమ్మబడును. మూడవరకము షాపులలో పదునాఱుషిల్లింగుల వెలగలజోళ్ళజతలు అమ్మబడును. 1928లో అతని దుకాణముల అన్నిటియందును కలసి నలుబది లక్షలపౌనుల విలువగలజోళ్లు విక్రయించబడెను.

జోళ్ళను మరమ్మతుచేయు ఆతనిషాపు ప్రపంచములో బోళ్ళనుమరమ్మతు చేయు అన్నిషాపులకంటెను పెద్దది. దానిని షాపు అనుటకంటె ఫ్యాక్టరీఅనుట ఉచితముగా నుండును. మరమ్మతు విషయమున కొద్దిలాభమును తీసుకొనుటయే అతని సంకల్పము.

అతడు తనమేనేజర్లకు స్వాయముగా తిరిపియతు నొసగును. అవసరమగుచో వారితో కూడకలసి పని చేయును. ఒక్కొక్కప్పుడు అతడు తనపనివాళ్ళతోకలసి పనిచేయును. ఒకప్పుడు జోళ్ళనుకుట్టుటలో తాను చూపిన చాకచక్యమును అట్టిసమయములందు ఆతడు వారికి చూపగలుగును. జోళ్లుపెట్టియుండు పెట్టెను ఆతడు తెలుచునంత చులుకుగా ఆతని పనివారలలో మఱియెవ్వరును తెలువజాలరు.

ప్రతి శనివారమును ఆతడు తనపనివారలందఱితో సంప్రదించుటకు ప్రత్యేకించును. వారికి ఉచితమగుసలహాను ఇచ్చుటలో ఆతనికి కుతూహలము మెండు. తనపనివారలందఱికిని తామొకకంపెనీకి చెందినవారమను ఐక్యభావము కలుగుటకై ఆతడు విశేషకృషి చేయును. తనమేనేజర్లకు అతడు తఱుచువిందులు చేయుచుండును.

అతడు నికరమైనసరకునే విక్రయించును. పనికిమాలినసరకును విక్రయించుటకు అతడు ఎంతమాత్రమును అంగీకరింపడు. ప్రతియొక ఖాతాదారులను తిరిగి రావలయునని అతడు కోరును 'నమ్మకమే వ్యాపారమునకు మూలస్తంభము. దుకాణదారుని సుగుణము వ్యాపారవిజయమునకు మూలసూత్రము.' అని అతడు చెప్పును.

ఆస్కాట్జాతీయుడు ప్రపంచమునందలి జోళ్ళచిల్లరవర్తకులలో అద్వితీయుడు. అతడు ఆర్జించిన లక్షలకొలదిధనములో ప్రతి దమ్మిడియు న్యాయముగ ఆర్జించినది.

కావలి వెంకటబొర్రయ్య

[లోకల్ రికార్డ్సును సంపాదించిన కల్నల్ కాలిన్ మెకంజివద్ద ప్రధానపండితుడు. ఏడుభాషలయందు ప్రజ్ఞగల మేధావి. పురాతన శాసనలిపి పఠనవిద్యను భారతదేశమున అభ్యుద్ధరించినవారిలో అగ్రసరుడు.]

లోకల్ రికార్డ్సును సంపాదించిన కల్నల్ కాలిన్ మెకంజీ జీవితము లోగడ ఆంధ్రభూమి పాఠకులకు పరిచయము చేయబడినది. మెకంజివద్ద ప్రధాన పండితుడుగ నుండిన ఆంధ్రమహాశయుడు కావలి వెంకట బొర్రయ్య జీవితము ఇచ్చట ప్రస్తరింపబడుచున్నది.

కావలి వెంకటబొర్రయ్య 1776-వ సంవత్సరమున పుట్టెను. నేటి పశ్చిమ గోదావరిజిల్లాకు ప్రధాన నగరమగు ఏలూరు పట్టణము అతని జన్మస్థలము. తండ్రిపేరు వెంకటసుబ్బయ్య. ఇంటిపేరు కావలివారు. కావలివారిది ఆరువేలనియోగిశాఖ. విజయనగరరాజులవద్ద కావలివారి పూర్వులు మంత్రులుగ, రాయబారులుగ నుండిరి.

బొర్రయ్య పదియేండ్ల వయస్సు వచ్చువఱకు ఏలూరునందలి ఒక ప్రయివేటు స్కూలులో విద్యాభ్యాసము గావించెను. పిమ్మట అతడు ఆపాఠశాలను వీడి సంస్కృతభాషాభ్యాసమునకు కడంగెను. అతడు అద్భుతమైన మేధాశక్తి కలవాడగుటచే ఐదు, ఆఱు మాసములు సంస్కృతభాష నేర్చుసరికి ఆభాషలో స్వతంత్రముగ కవనముకట్టి శ్లోకములు చెప్పగలిగెను. చిత్రమేమన ఆపదియేండ్ల బాలుడు చెప్పిన శ్లోకములు పండితులచేత సయితము ఆహా! అనిపించుకొనజాలియుండెడివి.

బొర్రయ్య అన్నలు అప్పటికి ఈస్టు ఇండియా కంపెనీవారి సేవలోనుండిరి. కంపెనీవారికి బొర్రయ్య సోదరులయెడ మంచి విశ్వాసముండెను. బొర్రయ్యకును కంపెనీవారి సేవలో జేర కుతూహలముకలిగెను. అగుట అట్టి సేవలో చేరుటకు వలయు పారశీక భాషాజ్ఞానమును, హిందూస్తానీభాషాజ్ఞానమును సంపాదించుటకు అతడు దీక్షతో పూనుకొనెను.

ఏలూరునకు రెండుమైళ్ళ తూర్పున ఉన్న కొత్తూరు జాగీరుదారు అప్పటి అతనిగురువు. అచిరకాలముననే అతడా భాషలలో మంచి పాండిత్యము సంపాదించెను. పదునాలుగేండ్ల ప్రాయమున అతడు మచిలీపట్టణమున మార్గన్ అను నతడు నిర్వహించుచుండిన పాఠశాలలో విద్యార్థిగ చేరెను. ఆపాఠశాల వీడిన పిమ్మట బొర్రయ్యకు ఏలూరునందలి పదాతిసైనికుల కమాండర్ అగు కల్నల్ పియర్స్ అనువాని పోషణయు, మిత్రత్వమును లభ్యమయ్యెను.

విశ్రాంతి సమయములందు బొర్రయ్య తెలుగు పద్యకావ్యములను, వ్యాకరణమును చదువుచుండువాడు. ముఖ్యముగ అత్తలూరి పాపయ్యకవి కావ్యములను అతడు దీక్షతో పఠించెను.

మచిలీపట్టణమున అప్పుడుండిన మిలిటరీ పే మాస్టర్ ఆఫీసులో బొర్రయ్య అప్రెంటిస్‌గా చేరెను. చేరిన కొలది కాలమునకే అతడచటి వ్యవహారములన్నిటిని తబిసీలుగ ఆకళింపగలిగెను. అగుట బొర్రయ్యను ఒంగోలు, మంగళ, కొండపల్లి మున్నగు స్థలములందుండిన సైనికులకు జీతములిచ్చుటకు పలుసారులు పంపుచుండిరి.

పదునెనిమిదేండ్ల ప్రాయమున అతడు నరసాపురము చెంతగల మాధవాయి పాళెమున డెంటు అనువానివద్ద గుమాస్తాగా ఉండెను. ఆరోజులలో మెకంజి (అప్పటికి లెఫ్టినెంటు మాత్రమే) నిజాము

రాజ్యమును సర్వే చేయుచుండెను. బొఱ్ఱయ్య అగ్ర సోదరుడగు నారాయణప్ప మెకంజివద్ద దుబాసిగా ఉండెను. నారాయణప్ప సిఫారుసుమీద బొఱ్ఱయ్య మచిలీపట్టణమున తన పూర్వపు యజమానివద్దకు బదలీ చేయబడి అచ్చట హెడ్‌గుమాస్తా ఉద్యోగము పొందెను.

మెకంజి తనమిత్రుడగు సర్ అలెగ్జాండరు జాన్‌స్టన్‌కు వ్రాసిన ఒకానొక ఉత్తరములో వెంకట బొఱ్ఱయ్య ప్రతిభాప్రాగల్భ్యములను గూర్చి ఇట్లు చెప్పుచున్నాడు: 'ఈదేశస్థుడైన ఒక బ్రాహ్మణునితో అప్పుడు నాకుకలిగిన పరిచయము హైందవ విజ్ఞానమునందలి నా అభినివేశమునకు ప్రథమ సోపానమయ్యెను. ఆబ్రాహ్మణుని నామము సి. వి. బొఱ్ఱయ్య. అత డిప్పు డీలోకమున లేడు. నాపరిచయమును పొందుసరికి అతడు మిక్కిలి పిన్నవాడై యుండెను. కాని అద్భుతమైన మేధాశక్తి కలిగియుండెను. కలుపుగోలుతనముతో అన్ని కులములవారిని, అన్ని మతములవారిని సమ్మతింపజేసి వలయు భోగట్టాను కూర్చుటలో అతని నేర్పు అనంతమైయుండెను. నాకు ఈదేశభాషలు ఏమియురావు. కాని ఈవ్యక్తి యొక్క తెలివితేటలే అమితమగు ప్రోత్సాహము నిచ్చి నాకు వలసిన విషయములను సంగ్రహించుటకు వీల్లు ఏర్పఱచెను. శ్రీరంగపట్టణము పట్టుబడినప్పుడు మావద్దనున్న ఏఒక్కరు గాని కన్నడభాష నుండియైనను భాషాంతరీకరింపజాలకుండిరి. నేడు మావద్ద భాషాంతరీకరణవేత్తలు పలువురు ఉన్నారు. వారు నేటి లిపినుండియేగాక వ్రాబడిన శాసనలిపి నుండియు భాషాంతరీకరణము చేయగల సమర్థులైయున్నారు. కన్నడము, అరవములందేగాక సంస్కృతమునందును వారికి అపూర్వమైన అభినివేశముండెను. బొఱ్ఱయ్య నావద్ద చేరినప్పటినుండియు హైందవ విజ్ఞానమునందలి ఒక శాఖమాకు కరతలామలకమయ్యెను. దురదృష్టవశమున బొఱ్ఱయ్య చిన్నతనమునసే అకాలమృత్యువు పాలబడెను. కాని తన పనిలో అతడు తనతమ్ములను శిష్యులను తయారుచేసెను. ఈపండిత సంఘసహాయమున ఈరాజధాని యందలి చారిత్రక విషయములన్నియు జయప్రదముగ ఏర్పికూర్చుటకు అవకాశముగలదు.''

ఆఫీసుకు పనికివచ్చు భోగట్టాను సమకూర్చుటకై బొఱ్ఱయ్యను అతని యజమాని తఱుచు దేశముమీదికి పంపుచుండువాడు. భోగట్టాకు పనికివచ్చు విషయములను, వస్తువులను సంగ్రహించుటలో అతడు కనబఱచిన దీక్ష, కుశాగ్రబుద్ధి యజమానియొక్క పూర్ణామోదమును పొందుచుండెను. ఈస్టు ఇండియా కంపెనీవారి స్థితిని ఈప్రాంతములందు పెంపొందించుటకు బొఱ్ఱయ్య పరిశ్రమ యెంతయు అనుకూలపడుచుండెను. బొఱ్ఱయ్యపని మిక్కిలి కష్టమైనదిగా నుండెను. పనిసందర్భమున అతడు తఱుచు శ్రీశైలము చెంతగల అడవులలో, కొండలలో తిరుగవలసి వచ్చుచుండునది.

ఇట్లు సర్వే జరుగుచుండగనే మెకంజీని మానిల్లాపై దండయాత్రకుపంపిరి. ఆసందర్భమున అన్ని పనులు కట్టిపెట్టి బొఱ్ఱయ్య ఇంటికి తిరిగి రావలసినవాడయ్యెను.

హైదరాబాదునుండి మదరాసుకు తిరిగి వచ్చుటలో బొఱ్ఱయ్య యాత్రావిషయములన్నియు గ్రంథస్థమొనర్చెను; సంస్కృతమున, ఆంధ్రమున కొన్ని కావ్యములు వ్రాసెను; హిందూదేశ చరిత్రకు సంబంధించిన పెక్కు విషయములను సంగ్రహించెను.

తన జన్మస్థలమగు ఏలూరులో తానుండిన దినములలో అతడు కళలయందును, శాస్త్రములందును తనకుగల అద్భుత ప్రజ్ఞను ప్రదర్శించెను. ఆపట్టణ ప్రజలు అతని అద్భుతప్రజ్ఞను, కలుపుగోలుతనమును, సుస్వభావమును చూచి అమందానందమును పొందిరి. మానిల్లా దండయాత్ర ముగిసినపిమ్మట మెకంజి తిరిగివచ్చి మదరాసు రాజధాని సర్వేపనులను ప్రారంభించి బొఱ్ఱయ్యను తిరిగి ఉద్యోగమున నియమించెను.

1798 సంవత్సరమున జరిగిన టిప్పుసుల్తానుపై దండయాత్రలో బొఱ్ఱయ్య మెకంజికూడ నుండి

నైజామురాజ్యమునందలి చిన్న జమీందారీయగు గాడివాచెంతకు వచ్చువఱకుగల యాత్రావిశేషములను గ్రంథబద్ధమొనర్చెను. ఈజమీందారిలో ప్రయాణము చేయుచుండగా ఒకసారి అచటివారు మెకంజి ఆఫీసు కాగితములను దొంగలించిరి. వానిని తిరిగి తీసికొని రావలసిన భారము బొర్రయ్యపై బడెను. ఈ ప్రయత్నములో ఆజమీందారు బొర్రయ్యను చెఱలో పెట్టి ఆహారమైనను ఈయక మిక్కిలి కష్టపెట్టెను. ఆసందర్భమున బొర్రయ్య తనపాండిత్యమును ప్రకటింపజేయుచు కొన్ని పద్యములను వ్రాసెను. అందుతో ఆజమీందారు ప్రసన్నుడై మెకంజి కాగితములను తిరిగి ఇచ్చివేయుటయేగాక బొర్రయ్యకు ప్రత్యేకముగ బహుమానములనిచ్చెను.

పిమ్మట బొర్రయ్య మెకంజీని కలసికొని అతనితో శ్రీరంగపట్టణము వెళ్ళెను. శ్రీరంగపట్టణము ముట్టడిలో బొర్రయ్య సన్నిధినిఉండి ఆయావిషయములను వీరరసము ఉట్టిపడునట్లు పద్యములలో అభివర్ణించెను. కోటబురుజులమీద బ్రిటిష్ బావుటా స్థాపించు ఘట్టములు లెస్సగ వర్ణింపబడినవి. ఈ కవనమునకు బొర్రయ్యను మెకంజి మిక్కిలి మెచ్చుకొని మంచి బహుమానమిచ్చెను.

టిప్పుసుల్తాను ఓడిపోయిన పిమ్మట మెకంజి మైసూరు సర్వేచేయుటకు సూపరింటెండెంటుగా నియమింపబడెను. బెంగుళూరు, నిజగల్లు, సీరామీదుగా బొర్రయ్య మెకంజితో చితల్దుర్గమునకు ప్రయాణముచేసెను. ఈస్టు ఇండియా కంపెనీవారి అభివృద్ధికి దోహదమిచ్చుటకు ప్రజల సేవనుకూడ గట్టుటకు వలయు భోగట్టాను తెలిసికొనుటకు చేయు ఏర్పాటుల విషయములో బొర్రయ్య తన యజమానికి అమితముగ తోడుపడువాడు. దక్షిణ హిందూదేశ చరిత్ర తెలిసికొనుటకు వలయు పరికరములను కూర్చుటయందును అతని సాయము అమూల్యమైనదై యుండెను.

దూండియా అను మహారాష్ట్ర యోధుడు 1800 సంవత్సరమున హరిహర ప్రాంతమున సర్ ఆర్థర్ వెలస్లీచే పట్టుకొనబడిన సందర్భమున బొర్రయ్య ఒక పద్యకావ్యము వ్రాసెను. అటుపిమ్మట ఒకానొక మతప్రవక్త నుద్దేశించి శతకమొకటి చెప్పెను. ఆశతకరచనము కారణముగ ఆ ప్రవక్త ప్రఖ్యాతి ఇనుమడించెను.

శ్రీరంగరాజ చరిత్ర అను మతియొక గ్రంథమును కూడ బొర్రయ్య రచియించెను. ఉమ్మత్తూరు స్థాపింపబడినప్పటినుండియు శ్రీరంగపట్టణపు రాజుల వంశవివరము అందుగలదు. శ్రీరంగపట్టణపు పూర్వస్థితి, దానిని వెనుక పరిపాలించిన యాదవరాజుల పుట్టుపూర్వోత్తములు ఆకావ్యమున వర్ణింపబడినవి.

శ్రీరంగపట్టణము ముట్టడికి పిమ్మట కంపెనీ సేనలతో కలసి బొర్రయ్య దత్తమండలములందును, మైసూరు రాష్ట్రమునందును సంచారము చేసెను. ఆ సందర్భమున మైసూరు దివానువంటి దేశీయమహాపురుషులే గాక కంపెనీ ఉద్యోగులలో పేరుపొందిన విజాతీయులు జనరల్ కాంబెల్, కల్నల్ మన్రో మున్నగు వారుకూడ బొర్రయ్యను మిక్కిలి ప్రశంసించునారు.

మెకంజి నిర్దేశము ననుసరించి బొర్రయ్య గణితమున, రేఖాగణితమున, ఖగోళశాస్త్రమున, భూగోళశాస్త్రమున, ఇతర శాస్త్రములందున ప్రాక్పశ్చిమపద్ధతుల రెండింటిని నేర్చెను. అతని ధారణాశక్తి అద్భుతమైనదగుటచే దేశీయ భాషలలో పెక్కింటియందు అతనికి మంచి జ్ఞానములవడెను. దేశపటములను, సర్వేమాప్లను వ్రాయుటలో అతని నేర్పు నిరుపమానమై మెకంజి మెప్పునందెను.

ప్రాచీనములగు నాణెములను పెక్కింటిని బొర్రయ్య గుర్తించెను. పెక్కుశాసనములకు ప్రతిబింబములను తీసెను. పెక్కులిపులను చదువగలిగి యుండెను. దొడరప్రాంతమున దొరకిన హాలకన్నడ శాసనమును అతడు చదువగలిగినప్పుడు మెకంజిపొందిన ఆనందము మేరలేనిది.

మెకంజీకివచ్చి మదరాసులోని ఫోర్టు సెట్ జార్జికోటలో పనిచేయమని ఆర్డరురాగా 1801-వ

సంవత్సరమున బొజ్జయ్యకూడ మదరాసువెళ్లెను. రెండు సంవత్సరములు అచట పనిచేసెను. పెక్కు పుస్తకములను సంపాదించెను.

అప్పటికి బొజ్జయ్యకు ఇరువదియారేండ్లునిండెను. 1803 లో పక్షవాతమునకు గుఱియై యామేధావి చనిపోయెను. సముద్రతీరమున అతని స్మరణార్థము ఒకసమాధి మెకంజీ ఆజ్ఞానుసారము నిర్మింపబడెను. దానిపై ఒక శాసనము వేయబడెను. 1829 వఱకును ఈసమాధి సుస్థితియందుండెను.

బొజ్జయ్యకు పండ్రెండవయేట వివాహమయ్యెను. కళింకోట జమీందారు అయిన వెంకటచలం యొక్క చిన్నచెల్లెలు అతనిభార్య. మరణకాలమునాటికి బొజ్జయ్యకు ఒక కూతురు.

ఆ దినములలో ఆమేధావి అకాలమరణమునకు విచారింపనివారు ఎవరునులేరు. 1796 లో బొజ్జయ్యకు మొదటిసారి మెకంజితో పరిచయము ఏర్పడెను. ఆతడు ఏడుసంవత్సరములు మెకంజిసేవలో గడిపెను. పలువురు పండితులను తరిఫీతు చేసి మెకంజి తలపెట్టిన పనికి ఆతడు అనంతముగ సాయపడెను.

బొజ్జయ్య సోదరులలో వెంకటలక్ష్మయ్య, వెంకటరామస్వామి పేర్కొనదగినవారు. 1817 లో మదరాసు ప్రభుత్వమువారు వెంకటలక్ష్మయ్యకు మదరాసు చెంత ఒక అగ్రహారమును ఇచ్చినారు. లక్ష్మయ్యయు, అతని తరువాత రెండు తరములవారును ఆ అగ్రహారమును అనుభవించుటకు నిర్ణయము. కావలి వెంకటరామస్వామి కొంతకాలము మదరాసు ప్రభుత్వమువారి హెడ్ ట్రాన్సులేటరుగను, కొంతకాలము యాంటిక్వేరియన్ శాఖలో పండితుడుగను ఉండెను. 1829 లో దక్షిణా పథకవులను గ్రంథమును ఆంగ్లమున ప్రచురించెను. కావలి వెంకట బొజ్జయ్య జీవితమునకు సంబంధించిన పైవిషయలు ఆగ్రంథమునుండి గ్రహింపబడినవే.

మెకంజియుగపు ఆంధ్రవాఙ్మయ చరిత్రమున కావలి సోదరులు ప్రముఖస్థానమును వహించుచున్నారు.

కొన్ని కొన్ని చెదుళ్లు

౧ పూల మాల సీలకూడ
వాడి పోయి జాడ సెడ్డ,
నీ వలపున కీలుగంటి !
తెలిసికొంటి తొంటితీవ.

౨ మబ్బుచీర పయటలోన
ఎడద ? లేక యింద్రధనుస ?
మెఱసేన్ నీదేహాయష్టి
కురిసే ననురాగవృష్టి

౩ చేయివీచి యిపుడంటే
గాజుల గలగలగాని
చేతమఱచి యెపుడంటే
అంతా ఆలోచనయే !
పంవిటి విసరి యిటులంటే
పవన సంహాతులుగాని
పంవిటి మఱచి యెటులంటే
అంతా ఆలోచనయే !
కోర్కెవేచి తీర్చంటే
గుండె గుబాళింపుగాని
కోర్కెమఱచి 'కో' అంటే
అంతా ఆలోచనయే.

౪ పరధ్యానముగ నీవుంటే
పురిగొల్పన్ గొనగోటన్ దాకితి,
అదే నఖక్షతమై పోతే
నేనేమిసేతునిక సయ్యాట.
మౌనముదాలిచి నీ వుంటే
కనుసైగను నే కదలిస్తి
అదే ప్రతిధ్వని కేకేస్తే
నేనేమిసెబుదు చెవిలో మాట.
ప్రేమింపక నీవు తూర్పుమొగంగా
పడమటదెస కేఁ బయనిస్తి
అదే సూర్యునకు దారైతే
నేనేమని సూపుదు పగలాట

—కవి కొండల వెంకటరావు.

ఎలకల్ని ఎక్కడా లేకుండా చేయాలంటే?

ఎలకలబాధ ఎట్టిదో అందరికీ తెలిసిందే. ఎలకలు లేకుండావుంటే ప్రపంచం ఇప్పటి కంటె ఎంతో సుఖమయంగా వుంటుంది.

కాని ఎలకల్ని లేకుండా చేయడం ఎట్లా?

ఎలకలజాతిలో బహుభార్యాత్వంవుంది.

బహుభార్యాత్వంవుంది కాబట్టి ఎలకలు సర్వత్రా వ్యాపించి ఒకపీడగా ప్రబలినాయి.

ఇప్పుడు మానవుడు ఎలకల్ని చంపడానికి ఉపయోగించే పద్ధతులన్నీ వాటిలో బహు భార్యాత్వాన్ని పెంపొందించేవిగా వుంటున్నాయి.

ఎలకల్లో బహుభర్తృత్వం పెంపొందించామా అంటే ఎలకలపీడ మనకు అచిర కాలంలోనే వదిలిపోతుంది.

బహు భర్తృత్వంవుంటే మగఎలకల సంఖ్య ఎక్కువనీ, బహు భార్యాత్వంవుంటే ఆడ ఎలకలసంఖ్య ఎక్కువనీ సులభంగా నిర్ణయించవచ్చు.

సాధారణంగా అన్ని జంతువుల్లోలాగే ఎలకజాతిలోకూడా మగవే సాహసంగలిగి బయటికిపోయేవిగా వుంటున్నాయి. పిల్లల్ని కనడం పెంచడం మొదలయిన సంసారబాధ్యతలు ఏమీలేని కారణంచేత మగవే ఎక్కువ తఱుచుగా బయట తిరుగుతాయి. సాధారణంగా సృష్టిలో మగవి, ఆడవి సరిసమానంగా వుంటాయి. కాని మగవి తఱుచు బయట తిరుగుతూ వుండడంచేత అవి తఱుచు బోనులో పడ్డం, ఇతర కారణాలచేత నాశనంకావడం జరుగుతూవుంటుంది. మగవి ఎక్కువగా నాశనం కావడంచేత క్రమంగా ఆడవాని సంఖ్య ఎక్కువై బహుభార్యాత్వం ప్రబలింది.

బహుభార్యాత్వంచేత ఎలకజాతి అతి విస్తారంగా పెరిగిపోతూవుంది. మగవి తగ్గి ఆడవి హెచ్చడంచేత సంతానబాహుళ్యం కలగడమే కాకుండా ఆడసంతతి పెరుగుతూవుంది. కాబట్టి ఎలకల్లో మగవి తగ్గినకొద్దీ ఆడజాతి వృద్ధి పొందుతూంది కాని తగ్గటంలేదు. మగవానిని నాశనంచేసేపద్ధతి ఎంతమాత్రమూ మంచిది కాదు. ఇంతకాలం మానవుడు ఎలకల్ని చంపడానికి చేసే ప్రతి ప్రయత్నం విస్తారం మగ ఎలకల్ని చంపడానికి ఉపయోగపడ్డది. అది కారణంగా ప్రపంచములో ఎలకలసంఖ్య మిక్కిలి విస్తరించి అవి అంతటా అలముకోవడానికి అస్కారం కలిగింది.

ఎలకల్ని నాశనంచేయడానికి రాడియర్ పద్ధతి అని ఇప్పుడు ఒక కొత్తపద్ధతి కనుగొనబడ్డది. ఈపద్ధతి కష్టమైందికాదు. కత్తెర బోనులు మొదలయినవి పెట్టి వానిని చంపడానికి ప్రయత్నించకూడదు. బ్రతికిఉండగానే వానిని పట్టుకోవాలి. పట్టుబడ్డవానిలో ఆడ వాటిని ఏర్చి చంపివేయాలి. మగవాటిని తిరిగి వదిలిపెట్టివేయాలి. ఇట్లు వదిలిపెట్టి వేయడానికి పూర్వం అవి మరోసారి పట్టుబడ్డా వానిని మగవని సులభంగా గుర్తించడానికి వీలుగావుండేటట్లు వానితోకలు కోసివేయాలి. ఆడవానిని మాత్రమే చంపాలి.

ఆడవానినిచంపి మగవానిని వదిలేసి ఆజాతిలో మగవాని జనభా పెంచడంవల్ల బహుభర్తృత్వం ఆచరణలోకి వస్తుంది. ఆడఎలకలకంటె మగఎలకలు సంఖ్యలో ఎక్కువైనప్పుడు వానిలో వ్యభిచారం ఎక్కువౌతుంది. వ్యభిచారం విస్తరించినచోట గర్భధారణ, సంతానోత్పత్తి తగ్గిపోతాయి,

పైగా అట్టిసందర్భాల్లో పుట్టేపిల్లల్ని మగవి చంపివేస్తాయి. ఇది ప్రకృతిధర్మం. ఈపద్ధతిలో క్రమంగా మగవానిబాధకు తాళలేక ఆడ ఎలకలుచచ్చిపోతాయి. కాలక్రమాన్ని మగఎలకలు ముసలితనానికి గురిఅయి నశించిపోతాయి. ఆదెబ్బతో ఎలకలజాతి దుంపనాశనంఅయి పోతుంది.

ఈ పద్ధతివల్ల విశేషధనవ్యయం కూడా కాదు. పూర్తిఫలితం పొందడానికిన్నీ విశేష కాలంపట్టదు. మగఎలకలు ఎంత ఎక్కువైన కొద్దీ మొత్తం జాతిఅంత తక్కువైపోతుందనీ ఆజాతినాశనం అంత శీఘ్రంగా అవుతుందనీ విస్పష్టం.

జంతుపీడను వదల్చుకోవడానికి ఈరాడియర్ పద్ధతిని మించిన పద్ధతిమరిలేదని అంగీకరించితీరాలి. దీనిని ఎంతత్వరగా అవలంబిస్తే అంతమంచిదని తెలుసుకోవాలి.

అవసరమైతే ప్రపంచంలోని అన్ని దేశాల్లోను మగ ఎలకల్ని చంపడం శిక్షాపాత్రమగునని శాసనాలు పుట్టడంకూడా వాంఛనీయమే.

రాడియర్ పద్ధతి ఒక్కటే ఎలకల్ని సమూలంగా నాశనంచేయుగలది ; ఆచరణలో పెట్టడానికి సులభమైంది; ఉభయత్ర అంటే ఎలకలికి, మానవులికి అంగీకృతము కాగలది ;

సాధారణ పరిస్థితులలో ఎట్టి హానినికాని చేయలేనిది ;

మానవుడు చొఱలేని, ప్రవేశింపరాని ప్రదేశములందును ఎలకల్ని నాశనముచేయుటకు వీలయినది ;

ఎలకలికి ఆహారం పుష్కలంగా దొరుకుచున్నప్పటికీ కూడా వానినాశనానికి సమర్థమైంది ;

అతి సులభమైంది ;

మిక్కిలి చౌకఅయింది—ఎలకలచేతనే ఎలకల్ని చంపించివేయడంచేత ;

అనంతరకాలమందు హానిచేయుగల ఏరసాయనిక పదార్థములను కాని, విషపదార్థములను వాడడానికి అవసరంలేనిది ;

మనం చంపిన ఎలకల్ని, కోసిన తోకల్ని మనం ఎప్పటికప్పుడే కాల్చివేయడానికి అవకాశం వుండడంచేత ఆరోగ్యవిరుద్ధముకానిది ;

ఆచరణకు అనుకూలమైంది ;

పూర్తిగా హింసాకళంకితమని చెప్పుటకు వీలులేనిది ;

జంతువుల అభివృద్ధి సాధనములను శాస్త్రదృష్టితో గమనించి అందలి మర్మములను అవలోకించి నిశ్చయించినది.—

బహు భర్తృత్వదశలో మగఎలకలు తమజాతిని తినేవిగా తయారవుతాయి; జాతినాశనం అయేవరకు వానిలో ఈగుణం దినదినాభివృద్ధి అవుతూనే వుంటుంది.

మగవాని క్రమ సంహారము ఎలకలజాతిని వృద్ధిపొందించడానికి దోహదం చేయడమే.

బహుభర్తృత్వదశలో ఏజంతువులుకాని పీడగా తయారవడం ఇంతవఱకు కని విని వుండలేదు.

మూడువేల సంవత్సరాల పూర్వంనుంచీ మానవుడు ఎలకల్ని బహుభార్యాత్వదశలో నాశనంచేయడానికి ప్రయత్నిస్తూ ఇంతవఱకూ విఫల మనోరథుడై యున్నాడు.

రాడియర్ పద్ధతిలో ఆడఎలక పిల్లల్నికనే ప్రతి ప్రదేశానికి మగఎలక కూడా వెళ్ళి వానిని చంపివేయడానికి అవకాశంవుంది. ఈ పద్ధతి ప్రకృతి సమ్మతమైంది కూడాను. ప్రపంచంలో ఎక్కడా ఎలకల్ని లేకుండా చేయాలంటే ఇదే పద్ధతి.

మణిమాల

జనార్ధనరావుగారు

మిత్రులు కొంపెల్ల జనార్దనరావుగారు చనిపోయినందుకు చాలా విచారిస్తున్నాను.

బతకవలసినట్టిన్నీ, బతకతగినట్టిన్నీ కాలం యెంతో వున్నది. చెయ్యవలసినట్టిన్నీ, చెయ్యతగినట్టిన్నీ పని కూడా యెంతో వున్నది.

వాటికి తగిన సంకల్పమూ, ప్రయత్నమూ, ప్రారంభమూ కూడా జటిలంగానే వున్నవి.

కాని హఠాత్తుగా మరణం సంభవించింది.

ఇది అకాలమృత్యువు గాని కాలమృత్యువు కాదు పైగా యిది చేతులారా ఆంధ్రజాతే తెచ్చిపెట్టినది.

జనార్దనరావుగారు ప్రతిష్ఠకోసం ఆశించలేదు. డబ్బుకోసం చేతులు చాపలేదు. వైభవమున్నూ వాంఛించలేదు.

వారు పని చేస్తామన్నారు. నడుము కట్టుకొని కార్యక్షేత్రంలో ప్రవేశించారు.

కాని విశాలమైన ఆంధ్రదేశంలో—హిందూదేశం మొత్తంమీద మూడో స్థానం ఆక్రమించిన ఆంధ్ర జాతిలో ఆయనచేత పని చేయించగల మొనగాడు లేకపోయాడు.

*　　　*　　　*

గుప్పెడు తాటాకులూ వొక గంటమూ పుచ్చుకుంటే పూర్వకాలంలో కవుల పని తీరిపోయేది.

అప్పటివారికి తమ కవితాధోరణికి రూపం కల్పించుకోవడమూ, తమ పాండిత్యం ప్రకటించుకోవడమూ—ఇదే పరమావధి.

ఇప్పుడలా కాదు. కవులు అలా తృప్తిపడడానికిప్పుడు వీలు లేదు.

కవిత్వమూ, తదంగమైన విమర్శనా యిప్పుడు జాతీయతా నిర్మాణానికి ప్రధానసాధనాలుగా గుర్తించబడ్డవి. అంచేత కవికైనా విమర్శకుడికైనా యిప్పుడు వొక జపాన్ నోటుబుక్కూ, బ్లాకుబర్డ్ ఫౌంటెన్ కలమూ పుచ్చుకుని రాసేసి వూరుకుంటే చాలదు.

ఆరచన అచ్చువేయించాలి. దేశంమీద విరజిమ్మాలి. నలుగురిచేతా చదివించాలి. జాతి పురికొనేటట్టు చెయ్యాలి.

ఇది కభుర్లతో కాదు. పుష్కలమైన ధనం కావాలి.

జనార్దనరావుగారు కొంగు చాపి యాచించారు.

తమ సొంతానికా? కాదు. ఇందుకోసం. ఇంత పని చెయ్యడానికి.

ఆయన బండికోసం యెదురుచూడలేదు. నడిచి వెళ్లారు. పంచభక్ష్యపరమాన్నాలు తలుచుకుని ఉవ్విళ్ళూరలేదు. చారూ అన్నమూ వీటితో తృప్తిపడ్డారు. ఉజ్వలమైన వేషంకోసం అవస్థపడలేదు. అభిజనులతో కలిసి తిరగడానికి ఎంత సామాన్య దుస్తులు అర్హమైనవో అంతవాటితోటే తృప్తిపడ్డారు.

అయితే: కాగితాలు కావాలి. అచ్చుపడాలి. పోస్టేజీ కావాలి. ఇందులో వొకటిన్నీ వూరికే వచ్చేది లేదు.

ఇందుకోసం జనార్దనరావుగారు డబ్బు కోరారు.

జనార్దనరావుగారు ఇందుకోసం తమ జీవితమే ధారపొయ్యడానికి సిద్ధపడగా, సంవత్సరానికి నాలుగేసి రూపాయలు ధారపొయ్యడానికి సిద్ధపడగలవారు రెండు కోట్ల అరవై మూడు లక్షల ఆంధ్రులలో రెండు వందలైనా లేకపోయారు.

అయినా వారు నిరుత్సాహపడలేదు. తమ ప్రయత్నం చాలకపోయిందేమో అనుకున్నారు వారు.

కద్దరు కట్టినీ్న, లాఠీదెబ్బలు తినినీ్న, గాంధిగారి పేరూ, స్వరాజ్యం పేరూ వుదహరిస్తూ పెద్ద కభుర్లు చెప్పినీ్న పద్యాలు కట్టే వుత్సాహం వుబికినప్పుడు, దాన్ని, అమ్మాయిలమీదకి తిప్పే రకంవారు కారు వారు.

జనార్దనరావుగారు నైష్ఠికబ్రహ్మచారులు. రమా రమీ పాతికయేళ్ల వయస్సులో వుండిన్నీ వారు వివాహవాంఛ పెట్టుకోలేదు. బహుశా, వారు, శాశ్వతబ్రహ్మచర్యదీక్ష పూనినారేమో?

ఏమయితే యేం?

తమ అయత్నం చాలకపోయిందేమో అనుకున్నారు వారు.

ఇలా అనుకుని వారు నిరుత్సాహపడలేదు. దీక్ష దృఢపరుచుకున్నారు. ఉత్సాహం పెంచుకున్నారు. నిద్రాహారాల విషయంలో అశ్రద్ధ చూపించారు. ఏటి కెదురీత ప్రారంభించారు.

కాని ఎంత చేసినా, యేం చేసినా ఒక్క సంవత్సరమేనా సాఫీగా వెళ్లలేదు. ఊరూరూ తిరిగినా—రాత్రీపగలూ తిరిగినా ఉదయిని విలవ గ్రహించగలిగిన రసికులు వారికి కనపడలేదు. దేశంలో వెంటనే నెరవేరవలసిన మొదటి పని యేమిటో గుర్తించినవారు కనపడలేదు. అదృష్టి వున్నవారు సైతం కనపడలేదు.

భారతి ఆఫీసులో వున్నప్పుడు గుబురుగా చిగిరించి, ముమ్మరంగా మొగ్గతొడిగి, విరగబూసి వునట్టు కనపడిన ఆంధ్రదేశం, ఉదయినికి సంచిక తరవాత సంచిక తయారైన కొద్దీ మోడై మాడిపోయివుండడం వారికి బాగా తెలిసివచ్చింది.

ఒకనాడు, ఉదయం, చింతాద్రిపేటనుంచి ప్రబుద్ధాంధ్ర, పరశువాకంనుచి ఉదయినీ కాళ్లీడ్చుకుంటూ బయలుదేరినవి. ఎగ్మోరుస్టేషను అవతలి వంతెనమీద కలుసుకున్నవి.

ఇంకిపోతూ వున్న జీవనదీ, ఎండిపోతూ వున్న కల్పవృక్షమూ, సమావేశం అయినట్టున్నది ఆసమావేశం.

సూర్యుణ్ణి అస్తగిరి దాచివెయ్యగా చంద్రుణ్ణి కారుమబ్బు కమ్ముకున్నట్టున్నది ఆసమయం.

అయినా సమానధర్ముల సమావేశం కనక దుర్బలాలై వుండినా హృదయాలు ఉప్పొంగిపోయినవి.

ఏమి లేమిటో కబుర్లు వెళ్ళినవి.

ఉన్నట్టుండి "ఆంధ్రజాతి యిప్పుడెక్కడ వున్నదీ?" అని ప్రబుద్ధాంధ్ర ప్రశ్నించినది. "నరకం కంటె అధమాధమమైన లోకంలో—హిందూస్థానీవాడి కాలికింద" అని ఉదయిని జవాబు చెప్పినది.

ఉదయినిలో ఝుమాయించి రాయలేకపోయారు; కాని—కాంగ్రెస్సు మొగం చూచి కొంచెం తటపటాయించారు గాని, జనార్దనరావుగారు, హిందీదురాక్రమణం పూర్తిగా గ్రహించారు.

"ఇంగ్లీషు నేర్చుకోవడం మనం బాగుపడడానికి. హిందీ నేర్చుకోవడం మన భాషని చంపుకుని, హిందీని బాగుచెయ్యడానికి" అని వారన్నప్పుడు సుక్కి వుండినా, గంభీరంగానే వుండిన ఆమొగం మీద వీరతేజస్సు మెరిసి "ఆంధ్రవాఙ్మయానికి ఉజ్జీవనం కలిగించగల వ్యక్తి" అని అనిపించినది.

కాని, వారుండగానే ఉదయిని యెత్తుపడిపోయింది.

ఒకమూల, అడుగడుగునా ఆర్థికాఘాతాలు కదుములు కట్టిస్తూ వుండగా—ఇంకోమూల నిరుత్సాహం పేగులు తోడేస్తూవుండగా వారిని దారుణమైన వ్యాధి అలుముకున్నది.

దినదిన గండంగా అయినా పత్రిక నడుస్తూ వుంటే, వారు, రుణపడిపోయివుందురు; గాని జబ్బుపడి, చివరికి చనిపోయి వుండకపోవుదురు.

మళ్ళీ జనవరి మొదటి వారంలో కలుసుకున్నప్పుడు రోగం మళ్ళిందనుకున్నాము. అపాయం తప్పిందనుకున్నాము.

ఆవేళ సాయంత్రం, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు కాల్చి యిచ్చిన బ్రౌన్‌రొట్టెముక్కలు తింటూ, నవ్యసాహిత్యపరిషత్తునుగురించి చెబుతూ, వారు కనబరిచిన ఆవేదన యింకా స్ఫుటంగా స్ఫురిస్తూనే వున్నది. వారప్పుడు పలికిన మాటలింకా చెవులలో ప్రతిధ్వనిస్తూనే వున్నవి.

అయితే, మొదట మొదట ఆమాటలు బోధపడలేదు; కాని వెళ్ళిన కొద్దీ—ఏమి ధోరణి అదీ? నవ్యసాహిత్యపరిషత్తు విషయంలోకూడా జనార్దనరావుగారు సమానధర్ములేనా?

చాలా ఆశ్చర్యం కలిగింది.

* * *

ఇక యిప్పు డే మనుకున్నా యేమీ లాభం లేదు.

నవ్యాంధ్రసాహిత్యరథాన్ని విశిష్టపంథాలో నడిపించగల ప్రముఖులలో వొకరైన జనార్దనరావుగారు అకాలమృత్యువు వాత పడ్డారు.

అయితే, వారి ఆత్మకి మేము శాంతి కోరము.

ఆంధ్రసాహిత్యాన్ని గురించి. అది, అనేకవిధాల మథనపడి పోయింది.

జనార్దనరావుగారు తమ కార్యక్రమం పూర్తిగా కాకపోతే కొంతవరకైనా సాగించడానికి తగిన సందర్భాలు లేకపోయాయి.

అంచేత యెవ రెన్ని విధాల యెందరెందర్ని ప్రార్థించినా వారి ఆత్మకి శాంతి కలగదు.

కనక నేను జనార్దనరావుగారు మళ్ళీ—వెంటనే తెనుగుదేశంలో పుట్టా లని కోరుతున్నాను.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

* * *

ఒక నూతన రహస్యము

౪౧ సంవత్సరముల ప్రాయముగలిగిన బెంజమిన్‌రాన్ యను నొక జర్మను రసాయనికు డిటీవలన యింగ్లాండుయందు పాలనుండి పట్టు తయారుచేసి ప్రపంచ వైజ్ఞానికుల విస్మయపరచెను. ఈతడు సుమారు ౧౦ సంవత్సరములనుండి నిరంతరముగా తన పరిశోధనాలయమునందు తనప్రయత్నమును సాగించి నేడు చక్కనిరంగులు గలిగిన సున్నితమగు పట్టును పాలనుండి సిద్ధపరచి చాలావరకు సఫలుడయ్యెను.

క్రీ ౧౯౩౧ సం॥న తాను పరిశోధనాలయమునందు సిద్ధపరచిన కృత్రిమపట్టును, సహజమగు, అనగా కీటకములనుండి తీయబడిన పట్టును కలిపి బర్లిన్ నగరమందలి పృథక్కరణాలయమునకు పరీక్షార్థము బంప అచ్చటి పరిశోధకులు పృథక్కరణ మొనర్చుటయందు విఫలులై. 'విడదీయుటసంభవ'మని విశదపరచిరి.

ఈతడింతవరకు సుమారు 3 లక్షల రూప్యములు పరిశోధనకై వెచ్చించినను తృప్తిజెందక తనపరిశోధనను మరింత తీవ్రతతో సాగించుచు దానియందుండిన లోపమును పూర్తిగా కనుగొనుటకు కృషిసలుపుచుండుట ఆతనిపట్టుదల పూర్తిగా విశదమగుచున్నది. కాని యుత్తమ పట్టులక్షణముల రహస్య మీతనికి తన పట్టుయందింకను పట్టుబడకున్నది.

వర్ణసౌందర్యము, పటుత్వము, మృదుత్వము స్థితిస్థాపకత్వము, ముడుతరహితత్వము మొదలగు ప్రాధాన్యాంశములు తన పట్టుయందు గలిగితీరునని యాశించుచున్నాడు. ప్రస్తుత మీతనిచే తయారు చేయబడిన పట్టుయందు నాలుగులక్షణములు విశదమగుచున్నను పరిపూర్ణాంశము మాత్రము లోపించుచు నేయున్నది.

పరిశోధనయందిటీవల యవలంబించిన పద్ధతి వలన కొంతసాఫల్యత చేకూరినదనవచ్చును.

పట్టు కీటకములకు ముఖ్యాహారము కంబళిలేక పూతికపండ్ల చెట్లాకులు. రెండు మంచిఆవులకు వీని యాకులనే మేపి వానితో సమానమగుపట్టును తయారుచేసి తీరెదనని యీతని ప్రయత్నము.

"ఆరోగ్యవంతములైన రెండుఆవుల నేరుకొని వారమురోజులవరకు వాని సహజాహారముపై మేపుచుందును. ఆపై వానిపాలను పరీక్షించెద; దానియందలి వెన్నను పరీక్షించెద; మీగడదీసినపాల విరుగును పరీక్షించి చూచెద. నాపృథక్కరణ పట్టుకిపాల విరుగు డే ముడిపదార్థము."

"ఆపై వీనిమేతయందు కొంత కంబళియాకు కలిపి వీనిని మేపి ఆపైన పాలు, వెన్న పాలవిరుగుల పరీక్షించెద. అటుతర్వాత మూడువారముల మట్టుకు పూర్తిగా కంబళిఆకులనే మేపి పైయంశయలను పరీక్షించిచూచెద.

"కంబళియకుల మేసిన ఆవుపాలనుండి పాలవిరుగుడు నాపట్టుపరిశ్రమకు తదితరములకన్న మిగుల సాయకారిగా దేలినదానిని రసాయనిక పృథక్కరణ మొనర్చి మూడింటియందలి భేదాంశముల రహస్యము కనుగొనుటకు ప్రయత్నించెద."

"ఈవిభేదపు రసాయని కొంశములు నిర్ణీతములైన పరిశోధనాలయమునందే విభేదోత్పత్తితో స్వాభావికమగు పాలవిరుగుడును అభివృద్ధి పరచుమార్గములు సంభవమగుననుట నిశ్చయమని రాస్ విశదపరచెను.

ప్రస్తుతము రాసుగారికి అవసరమున్న ఆవులు, తత్సంబంధపు పరికరము లందింపబడినను కంబళిఆకుల ఆవసరమింకను పూర్తిగాకుండు చున్నది.

ప్రతిరోజు పితుకబడే యొకసామాన్యమగు ఆవువలన అర్ధశేరు [౩౭ తులములు] పృథక్కరణ మగుపట్టు తయారుచేయగలుగు పాలవిరుగుడు లభించు చుండును. ఇది పాలనుండి వెన్నదీసినపిదపనే.

చక్కగాచుట్టిన ఆరుతులముల పట్టుదారము లభించుటకు ౩౦ వేల పట్టుకీటకములకు నొకటన్ను [అనగా ౧౦ పల్లాలు] కంబళిఆకు ఆహారమత్యవసరమనుమాట జ్ఞాప్తియందుంచుకో తగినది.

రాస్‌గారి ప్రయత్నములు విజయవంతములైన పట్టు చౌకగునో లేక పాలు ప్రియమగునో తెలియుటలేదు.

(గోలుకొండపత్రిక.)

* * *

పాండవయుద్ధకాలము

కలియుగ గతాబ్దాః 821 చాంద్రమానేన రౌద్రి సంవత్సర మార్గశీర్ష శుద్ధ 13 గురువారం (బి. సి. 2281 సంవత్సరం నవంబరు 6 తేది గురువారం) యుద్ధప్రారంభము. వ్యాసులవారు చెప్పిన ప్రకారం యుద్ధవత్సరమున గ్రహణములు సరిగా ఉన్నవి కాని గ్రహములు కొన్ని సరిలేవు. యుద్ధవత్సరమున శ్రావణశు 15 శుక్రవారంపాతిక చంద్రగ్రహణం—శ్రావణబ 30 శనివారం సంపూర్ణ సూర్యగ్రహణం—అధిక భాద్రపదమాసం పుష్య శు 15 సోమవారం సంపూర్ణ చంద్రగ్రహణం—పుష్య బ 30 మంగళవారం సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చియున్నవి. గ్రహములు కొన్ని సరిలేనందున వ్రాయలేదు. బి. సి. 2280 సంవత్సరం ఫిబ్రెవరు 23 ఆదివారం మేష సంక్రాంతి. యుద్ధవత్సరమున పుష్యశు 1 మంగళవారం మకర సంక్రాంతి జరిగినది. ఇది భారతమునకు సరిగా ఉన్నది.

(ఆంధ్రపత్రిక)

—నేలపల్లి బాపయ్యసిద్ధాంతి.

* * *

ఫిలోమినాతంబుచెట్టి

ఆ రేండ్లు ముక్కుపచ్చలారని పసిబాలికగా ఫిడేలును కొని యిమ్మనిఅడిగి యెనిమిదవ యేడు వచ్చేసరికి తలిదండ్రులను బంధుమిత్రాదులను అందరినీ ఆనందాబ్ధి నోలలాడింపగల వైదుష్యమునుపార్జించిన ప్రతిభావంతురాలు ఫిలోమినాతంబుచెట్టి. 16-వ యేడు వచ్చేసరికి పారిసు నగరమునకువెళ్లి అచ్చట గానకళాపరిషత్తుల నెల్లతన సలలితజంత్రగాన వైదుష్యముచే ఆనందాబ్ధి నోలలాడింపజేసినది. మన ఫిలోమినా ఫిడేలుపట్టుకొని వాయించుటలోనే ఒక అపూర్వవిన్నాణము, సోయగమూ కలవు, ఆమె మూర్తివంతమునందువలెనే. ఆమె వాద్యమును వాయిస్తూవుంటే వాతావరణమంతా ఒక నూతన సౌందర్యమునూ సౌరభమునూ పొందుతుంది. ఒక గొప్పకళాభిజ్ఞ కావలెనని—పేరు సంపాదించాలనీ—యీామెయేకైక అభిలాష. ఫిడేలు వాద్యములో యీనాడు ఆమెదే అగ్రతాంబూలము. ఖండాంతర ఖ్యాతితోబాటు భారతదేశ ధన్యవాదములనూ పొందుచున్నది. ఆరు సంవత్సరముల కాలము యూరోపులోనుండి వివిధదేశములగాన కళా సాంప్రదాయములను పఠించి అభ్యసించివచ్చినది. మంచి జవ్వని. బహు తెలివైనది. కళావంతమైనది. చూచినవాలు నెవ్వరైన సంతుష్టాంత రంగులుకాక వీలులేదు. కాని కడువినమ్ర. బహువిజ్ఞానవతి. ఆమె హృదయములో విప్లవాగ్నికణములు లేకపోలేదు. శోభాయమానమైన ఆమె నేత్రయుగళము ఆమె వదనమునకొక అపూర్వప్రశాంతత నిచ్చుటచేనది కనబడదు. ఈ మెయీామధ్యనే పరిణయమాడినది.

(త్రివేణి—వాహిని) —జి. వెంకటాచలం.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౧౯౨. మల్లికార్జునరావు

ఇదియొక సాంఘికనవల. పూలతోట గ్రంథమాలలో తొలి ప్రచురణము. హనుమకొండయందలి ఉస్మానియా ఇంటరుమీడియేటు కాలేజియందు సహాయాంధ్రో పాధ్యాయుడగు విద్వాన్ కంభంపాటి అప్పన్న శాస్త్రిగారిచే రచియింపబడినది. గ్రంథమునందలి ఇతివృత్తము కల్పితము. కథారంగస్థలము నిజాము రాష్ట్రాంధ్రదేశము. తెనుగునవలలో సాధారణముగ కనిపించు దీర్ఘవర్ణనములకు, నీతివిషయకోపన్యాసములకు ఇందు తావులేకుండుటయేఒకవిశేషము. విద్యార్థులకు సద్వర్తనము, పరోపకారబుద్ధి, సచ్ఛీలము, వినయ వివేకములు హత్తింపజాలు ఆదర్శములతో కథావృత్తము నడచినది. గ్రంథము ఇరువది దళములుగా విభాగింపబడినది. క్రౌను సైజున 118 పుటలు. చందాదారులకు రు 0-10-0. ఇతరులకు రు 0-12-0 దొరకుచోటు : పూలతోట గ్రంథమాల, హనమకొండ, నైజాము.

౧౯౩. హాస్యకుముదాకరము.

హాస్యకుముదాకరము అను గద్ద కొకి సంవాదము మహోపాధ్యాయ కల్లూరి వెంటరామశాస్త్రిగారు చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావుగారి సంపాదకత్వమున వెలువడుచున్న ఇతిహాస తరంగిణీ గ్రంథమాలలో రెండవపుస్తకముగా ప్రచురింపబడినది. దంభగరుడావధాన్లు, కాకోజీరావు అను ఇరువురు పాత్రలముఖమున ఇందలి ఇతివృత్తము నడచినది. 'చిన్నయసూరి బాలవ్యాకరణమునకు గుప్తార్థప్రకాశిక అనేపేరుతో వ్యాఖ్యరచించి కళాప్రపూర్ణ వేదం వేంకటరాయశాస్త్రులవారిచే వ్యాఖ్య వైయాకరణ సార్వభౌములని అభినందింపఁబడినవారును, తమగుప్తార్థప్రకాశికలో వ్యవహారిక భాషను గ్రామ్యభాషనుగా గ్రహించి నిరసించినవారునగు ఈవేంకటరామశాస్త్రిగారే హాస్యకుముదాకరమువంటి హాస్యరసప్రధానమైన గ్రంథమును వ్యవహారికభాషలో వ్రాయుట వింతవిషయం' అని సంపాదకులు వ్రాయుచున్నారు. గ్రంథమునకు తొలిపలుకువ్రాయుచు శ్రీయుత గిడుగు వేంకటరామమూర్తిపంతులుగారు 'శ్రీశాస్త్రిగారు ఈగ్రంథము ఇట్టి భాషలో రచించడము నాకు మిక్కిలి వింతగా తోచినది'అన్నారు. ఇందలి హాస్యము పండితరంజకమైయున్నది. డెమ్మిసైజున 74 పుటలు. వెల 0-6-0. దొరుకుచోటు : ఇతిహాస తరంగిణి గ్రంథమాల, కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా.

౧౯౪. ఆంధ్ర తేజము

ఉభయభాషాప్రవీణ బోడేపూడి వెంకటరావుగారు. కీర్తిశేషులగు వంగూరి సుబ్బారావుగారి 'మణిమేఖల' లోని 'వీరపత్ని' కిది రూపాంతరము. పద్యరచనము. శ్రీయుత విశ్వనాధ సత్యనారాయణ (యం. ఏ.) గారీ గ్రంథమునకు చక్కని పీఠిక వ్రాసియున్నారు. 'జాతికి నుబ్బిబోఁగ వీరమార్తాండుల విక్రమోజ్జ్వల కథానకగీతిక లాలపించుచు బండువుచేయు కవికుమారుల' వర్గమున చేరదలంచిన శ్రీవేంకటరావుగారి 'ఆంధ్రతేజము' నిజముగా ఆంధ్రులకు తేజము కలిగింపజాలినదిగా నున్నది. గ్రంథావతరణముననే 'విజయలక్ష్మి సమేతుడై వెడలివచ్చునాధునకు స్వాగతంబు లెన్నటికినిత్తు' అను చింతతో నున్నదివ్యాకారసంపన్నయా పదునాలుగేడుల ఆంధ్రవనితారత్నమొకర్తు మనకు పరిచయమగుచున్నది. ఆమె మగనిని సమరభూమికి మరలించిన వృత్తము చదువదగియున్నది. వీరమరణమందిన మగనితో నామె సహగమనము చేసినది. వేంకటరావుగారి ఆంధ్రాభిమానము కావ్యశిల్పమునుకూడ విస్మరించునదిగా నున్నది. క్రౌనుసైజున 60 పుటలు. ప్రతులకు బాపట్లబోర్డు హైస్కూల్ పండితులగు గ్రంథకర్తపేర వ్రాయునది.

Printed at The Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.